పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :299 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | మంగళవారం 3 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :299 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : TIRUPATI | TUE 3 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

ప్రతి మండలంలో కూటమి జెండాలు

రెపరెపలాడాలి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం



- రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ స్థానాలనూ కైవసం చేసుకోవాలని లక్ష్య నిర్దేశం
- కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- పట్టణ స్థానిక ఎన్నికల కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం
- తుఫాన్ల సమయంలోనూ ఎన్నికలు, పాలనపై ఏకకాలంలో దృష్టి సారించామన్న సీఎం

రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని, ఆ దిశగా ఎంపీటీసీ స్థానాల్లో పైచేయి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీల ముఖ్యనేతలతో ఆయన సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలనూ కూటమి పార్టీలే కైవసం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.

- మిగతా 2లో



- ఏపీలోని 13 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్
- నేడు (మంగళవారం) ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 138 కేంద్రాల్లో కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- టీడీపీ కూటమి, వైసీపీకి అత్యంత కీలకంగా మారిన పుర ఎన్నికల ఫలితాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉత్కంఠ రేపిన పట్టణ స్థానిక సంస్థల (ఖూదీ) ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. నవంబర్ 1న జరిగిన ప్రధాన పోలింగ్‌లో వివాదాలు తలెత్తిన 13 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పుడు ఓట్ల లెక్కింపుపై పూర్తి దృష్టి సారించింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

రీపోలింగ్ ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు ఫలితాలపై నిలిచింది. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 నగరపాలక సంస్థల కోసం 22, మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కోసం 116 కలిపి మొత్తం 138 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 556 కౌంటింగ్ హాళ్లు, 6,831 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులతో పాటు భారీగా సిబ్బందిని నియమించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్ కేంద్రాల

- మిగతా 2లో

5 జిల్లాల్లో ప్రశాంతంగా రీపోలింగ్

నవంబర్ 1న పోలింగ్ సందర్భంగా బూత్ కబ్జా, రిగ్గింగ్ వంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ 13 కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఆదేశించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం, అనంతపురం, తిరుపతి, వైఎస్సార్ కడప, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఉన్న 12 వార్డులలో ఈ రీపోలింగ్ జరిగింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించడంతో పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, పల్నాడు జిల్లాలోని మాచర్ల వంటి కీలక ప్రాంతాల్లో రీపోలింగ్ జరగడం గమనార్హం.



వైసీపీలో తీవ్ర మనోవేదన అనుభవించా..

11న పార్టీని ప్రకటిస్తా

- ఏపీలో తమ పార్టీ మూడో ప్రత్యామ్నాయ పార్టీ అవుతుందన్న విజయసాయిరెడ్డి
- 11వ తేదీన పార్టీ ప్రకటనలో ఎవరినీ కించపరచాలనే ఉద్దేశం లేదని వ్యాఖ్య
- అన్ని వర్గాలకు అధికారం కట్టబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ


- మిగతా 2లో



ఎన్నికల సంఘం అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణం

- పులివెందులలో 70 బూత్‌లలో ఏజెంట్లను తరిమేశారని ఆరోపణ
- 4 బూత్‌లలో రీపోలింగ్ పెట్టడం కంటితుడుపు చర్య అని విమర్శ
- ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం

- మిగతా 2లో



ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది..

తక్షణమే సాయం అందించండి

- అర్నబ్ తుపాను నష్టం అంచనా వేసేందుకు ఏపీలో పర్యటిస్తున్న కేంద్రబృందం
- కేంద్రబృందంతో సమావేశమైన సీఎం చంద్రబాబు
- అర్నబ్ తుపాను వల్ల ప్రాథమికంగా రూ.4,526 కోట్ల నష్టం వాటిల్లినట్టు చంద్రబాబు వెల్లడి
- రాష్ట్రానికి త్వరితగతిన సాయం అందించాలని కేంద్ర బృందానికి సీఎం విజ్ఞప్తి
- ఒకవైపు కరవు, మరోవైపు తుపానులతో ఏపీ ఇబ్బందులు పడుతోందని వెల్లడి

- మిగతా 2లో



హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు..

ఫేజ్-2కు రూ.150 కోట్లు

- మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్లు మంజూరు
- రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయింపు
- పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఫేజ్-2 అధ్యయనాలు, సర్వేలకు నిధుల వినియోగం
- శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం ప్రతిపాదన
- ఎయిర్‌పోర్టు నుంచి పాతబస్తీ వరకు.. మెట్రో రెండో దశకు ఊతం

- మిగతా 2లో



గ్రోక్ ఏఐతో ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ

- గ్రోక్ ఏఐ ఆదాయం, ఖర్చులపై ఎలాన్ మస్క్ వ్యాఖ్యలు
- సర్వర్ ఖర్చుల నియంత్రణకే వినియోగంపై పరిమితులని వెల్లడి
- ఏఐ కారణంగా భారీగా పెరుగుతున్న టెక్ కంపెనీల అప్పులు

- మిగతా 2లో

అమెరికాలో భారతీయులు నిరసన చేస్తే

ఊరుకుంటారా?

ఇమ్రాన్ ఖాన్‌కు కోర్టు మందలింపు

పెన్ పవర్ డెస్క్: ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ మేనల్లుడు, ఎన్నికల సంఘానికి (ఈసీ) వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్న నటుడు ఇమ్రాన్ ఖాన్ పై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

- మిగతా 2లో





మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే..

ఏం చేస్తానంటే..?

పెన్ పవర్ డెస్క్: ఇరాన్‌తో అమెరికా యుద్ధం, ప్రపంచ దేశాలతో సంఘర్షణల నేపథ్యంలో యూఎస్‌లో అధికశాతం ప్రజలు అధ్యక్షుడు ట్రంప్ ను వ్యతిరేకిస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే.. తాను

- మిగతా 2లో



బిల్‌బోర్డ్స్ హ్యాక్.. నీలి చిత్రాల ప్రదర్శన..

పెన్ పవర్ డెస్క్: బహిరంగ ప్రదేశాల్లో ప్రకటనలను ప్రదర్శించే బిల్‌బోర్డ్‌లపై ఒక్కసారిగా నీలి చిత్రాలు దర్శనమిచ్చాయి..! దీంతో రోడ్డుపై వెళ్తున్న ప్రజలంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ పరిణామంతో యాడ్ ఏజెన్సీ సంస్థలు కంగుతిన్నాయి. ఐదు దేశాల్లో ఇదే పరిస్థితి కనిపించడం సంచలనంగా మారింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

- మిగతా 2లో

పెన్ పవర్

మంగళవారం 3 నవంబర్ 2026



అమెరికా ఎన్నికలతో భారత్‌కు కొత్త పరీక్ష.. ట్రంప్ ఓడితే భారత్ కు లాభమా? నష్టమా?

ప్రపంచ రాజకీయాల్లో జరిగే ప్రతి చిన్న చలనం అంతర్జాతీయంగా పెద్ద అలలనే సృష్టిస్తుంది. ముఖ్యంగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్.. అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశమైన అమెరికా మధ్య ఉన్న వ్యూహాత్మక సంబంధాలు ఎంతో విడదీయరానివి. ప్రస్తుతం అమెరికాలో చోటుచేసు కుంటున్న రాజకీయ పరిణామాలు.. అక్కడ జరగబోయే ఎన్నికలు కేవలం ఆ దేశానికే పరిమితం కాకుండా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, దౌత్య వ్యూహాలు, లక్షలాది మంది నిపుణుల భవిష్యత్తును ప్రభావితం చేసే అత్యంత కీలక ఘట్టంగా మారాయి.డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ల నిర్ణయాలు.. ఒకవేళ డెమోక్రాట్ల ఆధిపత్యం పెరిగితే వచ్చే మార్పులు.. ఇలా ప్రతి పరిణామం భారత్‌పై సానుకూల.. సవాలుతో కూడిన ద్వంద్వ ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఈ ఎన్నికల తుది ఫలితాలు ఏ విధంగా ఉన్నా భారతదేశం తనదైన దౌత్య పటిమతో ఈ మార్పులను అధిగమిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.భారతీయ ఐటీ రంగానికి అమెరికా ఒక ప్రధాన వేదిక. గత కొంతకాలంగా హెచ్-1బీ వీసా విధానాలపై వస్తున్న ఆంక్షలు.. నిబంధనలు మన టెక్ నిపుణులను ఆందోళనకు గురిచేసిన మాట వాస్తవమే. అయితే అమెరికా కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలు మారితే వీసా విధానాల్లో కొంత నిలకడ, సానుకూల పారదర్శకత వచ్చే అవకాశం ఉంది. విదేశీ ప్రతిభకు గుర్తింపు లభిస్తే మన టెక్ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి సంస్థలకు సూతన ఉత్తేజం లభించడమే కాకుండా వేలాది మంది భారతీయ యువ నిపుణులకు అమెరికాలో సరికొత్త అవకాశాల ద్వారాలు తెరుచుకుంటాయి.అమెరికా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. భారతీయ ఔషధాలు, వస్త్రాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులకు అక్కడ మంచి డిమాండ్ ఉంది. అమెరికా అంతర్గత రాజకీయాల్లో వాణిజ్య విధానాలపై పునరాలోచన జరిగితే భారత ఎగుమతులపై విధించే సుంకాల భారం తగ్గి మన ఎగుమతిదారులకు ఊరట లభించవచ్చు. పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికన కుదిరే వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయి.ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న వ్యక్తిగత సంబంధాలు ద్వైపాక్షిక చర్చల్లో ప్రాధాన్యం సంతరించు కున్నాయి. అయితే అమెరికాలో డెమోక్రాట్లు అధికారంలో ఎక్కువ ప్రభావం సంపాదిస్తే మానవ హక్కులు, వాణిజ్య పారదర్శకత, పర్యావరణ విధానాలు వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో రక్షణ, సాంకేతిక రంగాల్లో భారత్‌తో సహకారం కొనసాగించాల్సిన వ్యూహాత్మక అవసరం అమెరికాకు కూడా ఉంది.అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నది మాత్రమే భారత్‌కు ముఖ్యం కాదు. గెలిచిన పార్టీ ఎలాంటి విధానాలను ముందుకు తీసుకెళ్తుందన్నదే అసలు ప్రశ్న. రిపబ్లికన్లు తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటే ట్రంప్ విధానాలకు మరింత రాజకీయ బలం లభించవచ్చు. డెమోక్రాట్లు ప్రతినిధుల సభను కైవసం చేసుకుంటే ట్రంప్ నిర్ణయాలపై నియంత్రణ, పర్యవేక్షణ పెరగవచ్చు.అధికారంలో ఎవరున్నా నాయకులు మారినా భారత్-అమెరికా మధ్య ఉన్న రక్షణ, ఇండో-పసిఫిక్ వ్యూహం, సాంకేతిక సహకారం , ఇంధన రంగాల బంధం బలమైన పునాదులపై నిర్మితమైంది. చైనా సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో భారత్ అమెరికాకు ఒక విడదీయరాని వ్యూహాత్మక భాగస్వామి. ఈ నేపథ్యంలో దౌత్యపరమైన అంశాల్లో సవాళ్లు ఎదురైనా భారతదేశం తన స్వావలంబన శక్తితో.. స్పష్టమైన విదేశాంగ విధానంతో ముందుకు సాగుతోంది.అమెరికా మధ్యంతర ఎన్నికలు భారతీయులకు ఒకేసారి ఆశలు, ఆందోళనలు కలిగిస్తున్నాయి. హెచ్-1బీ వీసాదారులకు కొంత ఊరట దక్కుతుందా? భారత ఎగుమతులపై సుంకాల భారం తగ్గుతుందా? భారత్-అమెరికా మెగా వాణిజ్య ఒప్పందం ముందుకు సాగుతుందా? అన్న ప్రశ్నలకు ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ ఎన్నికలు భారత్‌కు కేవలం ఒక పరీక్ష మాత్రమే కాదు.. కొత్త అవకాశాలను పసిగట్టి అంతర్జాతీయ వేదికపై మన బలాన్ని మరింతగా నిరూపించుకునే గొప్ప సందర్భంగా చెప్పొచ్చు.

ముగిసిన రీపోలింగ్.. ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- మొదటి పేజీ తరువాయి

వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీటీవీ కెమెరాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న ఏజెంట్లను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు.

కూటమి, వైసీపీకి ప్రతిష్మాత్మకం

రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న స్థానిక ఎన్నికలు కావడంతో ఈ పుర ఫలితాలు అధికార, విపక్షాలకు అత్యంత ప్రతిష్మాత్మకంగా మారాయి. 92 పట్టణ స్థానిక సంస్థలకు జరిగిన ఈ ఎన్నికల్లో నవంబర్ 1న సుమారు 60.96% పోలింగ్ నమోదైంది. 13 మేయర్, 70 మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులతో పాటు, కార్పొరేషన్లలో 804 డివిజన్లు, మున్సిపాలిటీలలో 2,382 వార్డుల భవిష్యత్తు రేపటి కౌంటింగ్‌తో తేలనుంది. ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే.. ఏం చేస్తానంటే..?

- మొదటి పేజీ తరువాయి

'మిస్టర్ వీటో'గా మారాల్సి రావచ్చని పేర్కొన్నారు. వారి అధికారాలను నియంత్రించేందుకు వీటో పవర్‌ను వినియోగిస్తానన్నారు."ఎన్నికల్లో వారు గెలిచి, కాంగ్రెస్‌పై పట్టు సాధిస్తే.. వారు చేసే బిల్లులను ఆమోదించకుండా అన్నింటినీ తిరస్కరిస్తాను. ఒకటి రెండు నెలలపాటు అలా చేస్తే.. చివరికి వారే నా దగ్గరికి వచ్చి ఒప్పందం చేసుకోవాలని చూస్తారు. అయితే.. అవన్నీ వృథా ప్రయత్నాలే అవుతాయి' అని ట్రంప్ అన్నారు. తన పాలనలో చరిత్రలోనే అత్యుత్తమ ఆర్థిక వ్యవస్థగా అమెరికా ఎదిగిందని పేర్కొన్నారు. రిపబ్లికన్లకు వచ్చే ఓట్లను సర్వేలు సరిగ్గా చూపించట్లేదని అసహనం వ్యక్తం చేశారు. అవకాశం వస్తే మరోసారి అధ్యక్ష స్థానానికి పోటీ చేయడానికీ తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. అయితే రాజ్యాంగ నిబంధనలు కఠినంగా ఉండడం వల్ల అది సాధ్యం కాకపోవచ్చని నిరాశ వ్యక్తం చేశారు.

చైనా.. రష్యా కంటే మెరుగ్గా గూఢచర్యం చేస్తాం..

తన ప్రత్యర్థులపై గూఢచర్యం చేయడంలో చైనా, రష్యా ల కంటే మెరుగ్గా అమెరికా పని చేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా సైనిక స్థావరాలపై చైనా, రష్యా గూఢచర్యం చేస్తున్నాయని నిఘా అధికారులు తనకు చెప్పిన విషయాన్ని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. వారి మాదిరిగానే వాషింగ్టన్ కూడా బీజింగ్, మాస్కోలను నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. ఆ విషయం గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. చైనా ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరించడానికి కుట్ర పన్నినందుకుగానూ అక్టోబర్ 30న లిరెన్, యువాన్స్ చెన్ అనే ఇద్దరు చైనా జాతీయులకు అమెరికా న్యాయ శాఖ 30నెలల జైలు శిక్ష విధించింది.

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తైన వెంటనే ఇరాన్‌పై దాడులు ప్రారంభించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కోరారు. అయితే ఆ దేశంతో ఒప్పందం చేసుకోవడానికి ప్రస్తుతం శాంతి చర్చలు కొనసాగించాలని తాను భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. శనివారం ఇరువురు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు.

ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది.. తక్షణమే సాయం అందించండి

అర్నబ్ తుపాను కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ. 4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో సోమవారం ఆయన సమావేశమై పరిస్థితిని వివరించారు. ఈ కష్టకాలంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుపాను సమాచారం అందిన వెంటనే స్పందించి, నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ), ఆధునిక టెక్నాలజీని సమర్థంగా ఉపయోగించుకోవడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను వెంటనే కేంద్రానికి పంపించాం" అని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఒకవైపు రాయలసీమలో ఎల్ నినో వంటి తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటే, మరోవైపు కోస్తా ప్రాంతం వరుస తుపానులతో అతలాకుతలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్నబ్ తుపాను మిగిల్చిన నష్టం నుంచి కోలుకోకముందే 'మురసు' రూపంలో మరో తుపాను ముప్పు పొంచి ఉందని గుర్తుచేశారు.తుపాను ప్రభావంతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం వివరించారు. ముఖ్యంగా కొబ్బరి, అరటి తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయని తెలిపారు. కరవును తట్టుకునేందుకు రాయలసీమ రైతులను ఉద్యాన పంటల వైపు ప్రోత్సహిస్తుంటే, ఇప్పుడు ఆ పంటలు కూడా తుపానుల బారిన పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆక్వా కల్చర్ రంగానికి కూడా భారీ నష్టం వాటిల్లిందని, మత్స్యకారుల పడవలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో హుద్ హుద్, తిత్లీ, మొంథా వంటి తుపానులు కూడా రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశాయని ప్రస్తావించారు.ప్రస్తుతం

7 వేల మంది సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని, సహాయక చర్యలను ఆర్టీజీఎస్ ద్వారానే పర్యవేక్షిస్తున్నామని సీఎం వివరించారు. కేంద్ర బృందం త్వరితగతిన తమ సిఫార్సులను కేంద్రానికి అందించి, రాష్ట్రానికి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కేంద్రం అందించే సత్వర సాయం, ఈ కష్టకాలంలో రాష్ట్రానికి ఎంతో ఊరటనిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

- మొదటి పేజీ తరువాయి

ఈ లక్ష్య సాధన కోసం కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తితో అందరూ ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికలపై తాను, పవన్ కల్యాణ్, మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పులివెందులలో హింస సృష్టించేందుకు కొందరు ప్రయత్నించినా కూటమి నేతలు సంయమనం పాటించారని అభినందించారు. త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవైపు ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల సహాయక చర్యలను సమర్థంగా చేపడుతున్నామని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టామని చంద్రబాబు వివరించారు.ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

గ్రోక్ ఏఐతో ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ

ఉత్పాదకత పెంచుకోవడానికి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వైపు చూస్తున్నాయి. అయితే, ఈ టెక్నాలజీ నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతుండటంతో సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం ఇదే విషయంపై స్పందించారు. తన 'ఎక్స్' సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోని 'గ్రోక్' ఏఐ చాట్‌బాట్‌కు వస్తున్న ఆదాయం కంటే నిర్వహణ ఖర్చే ఎక్కువగా ఉందని ఆయన అంగీకరించారు.ఎక్స్‌లోని ప్రీమియం యూజర్లు కొందరు, తమ వారపు గ్రోక్ వినియోగ పరిమితి వేగంగా అయిపోతోందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై స్పందించిన ఒక యూజర్, ఈ లిమిట్‌ను రీసెట్ చేయాలని మస్క్‌ను కోరారు. ఈ నేపథ్యంలోనే మస్క్ పైవిధంగా స్పందించారు. సర్వర్ ఖర్చులు మరింత పెరగకుండా ఉండేందుకే వినియోగంపై కఠినమైన పరిమితులు విధించాల్సి వస్తోందని ఆయన వివరించారు.

మరోవైపు, ఏఐ కోసం టెక్ కంపెనీలు చేస్తున్న అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది.

ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా వంటి దిగ్గజ సంస్థల మొత్తం అప్పు 2026 మధ్య నాటికి 578 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.54 లక్షల కోట్లు) చేరుకుందని తెలిపింది. 2025లో ఈ అప్పు 399 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ఏఐ టెక్నాలజీ అభివృద్ధి, నిర్వహణ ఎంత ఖర్చుతో కూడుకున్నదో స్పష్టం చేస్తోంది.

అమెరికాలో భారతీయులు నిరసన చేస్తే ఊరుకుంటారా?

- మొదటి పేజీ తరువాయి

అమెరికా పౌరసత్వం కలిగిన ఆయన.. నవంబర్ 14లోగా భారత్ విడిచి వెళ్లాలని ఇటీవల ఫారిన్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, వీటిని సవాలు చేస్తూ ఇమ్రాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం (.. ఈసీకి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నందుకు తీవ్రంగా మందలించింది. ఆయన ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (కార్డు కలిగిన అమెరికన్ పౌరుడని..కాబట్టి భారత పౌరుడిలా వ్యవహరించే హక్కు లేదని పేర్కొంది. అమెరికాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓ భారత పౌరుడు నిరసన తెలిపితే ఊరుకుంటారా అని ప్రశ్నించింది. అలా చేసిన భారతీయులను వెంటనే ఫ్లైట్ ఎక్కించి మరీ వెనక్కి పంపించేసేవారని కోర్టు వ్యాఖ్యానించింది. ర్యాలీలో పాల్గొన్న విషయంపై మీరు కోర్టుకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. 'చాలా ఏళ్లుగా భారత్‌లో ఉండడం వల్ల మీరు భారతీయుడు కాదనే విషయాన్ని మరిచిపోయి ఉంటారు. కానీ మీరు ఓసీఐ కార్డుదారు. కాబట్టి భారత పౌరుడిలా వ్యవహరించలేరు. సర్ ప్రక్రియ గురించి మాట్లాడటానికి.. దానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో పాల్గొనడానికి మీకు ఎటువంటి హక్కు లేదు. మీ జీవితంలో ఎక్కువ భాగం భారత్‌లోనే గడిపానని చెబుతున్నారు. బాలీవుడ్‌లో నటుడిగా స్థిరపడ్డారు. అయినా కూడా ఎందుకు ఇంకా భారత పౌరసత్వాన్ని స్వీకరించట్లేదు?" అని ధర్మాసనం ఇమ్రాన్‌ను ప్రశ్నించింది.

క్షమాపణలు చెప్పిన ఇమ్రాన్..

సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్నందుకు ఇమ్రాన్ ఖాన్ బాంబే హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. తాను అమెరికాలో జన్మించి, పుట్టుకతోనే అక్కడి పౌరసత్వం పొందినప్పటికీ.. తన జీవితమంతా భారత్‌లోనే గడిపానని పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న ఏ నిరసన సంస్థతో గానీ, వ్యక్తులతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనబోనని హామీ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొనడానికి క్షమాపణను అనుమతిగా భావించవద్దని స్పష్టం చేసింది. సెలబ్రిటీ హోదాలో ఉన్న వారి మాటలకు అభిమానులు, ప్రజలు ఆకర్షితులవుతారని పేర్కొంది. విదేశీయుల పట్ల భారత దేశ వైఖరి గురించి ప్రస్తావిస్తూ.. ఇక్కడి ప్రజలు 'వసుధైవ కుటుంబం' సూత్రాన్ని విశ్వసిస్తారని తెలిపింది. అయినప్పటికీ ఓసీఐ కార్డుదారులు భారత పౌరులకు కేటాయించిన రాజకీయ హక్కులను వినియోగించుకోలేరని పునరుద్ఘాటించింది. తదుపరి విచారణను డిసెంబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు 'లీవ్ ఇండియా నోటీసు' గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది.

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్-2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది.నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్-2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి.

రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్ పరిధిలోని రాయదుర్గం-కోకాపేట, పాతబస్తీ పరిధిలోని ఎంజీబీఎస్-చంద్రాయణగుట్టతో పాటు ఇతర శివారు ప్రాంతాలను

కలిపే కారిడార్లను ప్రతిపాదించారు.

మరోవైపు ప్రభుత్వ రుణాల పద్దు కింద కేటాయించిన రూ.125 కోట్లతో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థిక బకాయిలకు సంబంధించిన అవసరాలను సమతుల్యం చేయాలని భావిస్తున్నారు. ఈ నిధుల కేటాయింపుతో ఫేజ్-2 పనులకు సంబంధించిన తదుపరి చర్యలు ముందుకు సాగనున్నాయి.

ఎన్నికల సంఘం అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణం

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తొత్తుగా మారిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అక్రమాలే ఇందుకు నిదర్శనమని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థే అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణమని ఆయన మండిపడ్డారు.పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లకు గాను 70 చోట్ల తమ పార్టీ ఏజెంట్లను టీడీపీ గూండాలు అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. పోలీసుల సహకారంతోనే బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు దాడులకు పాల్పడి, తమ ఏజెంట్లను బూత్‌ల నుంచి బయటకు లాగేశారని తెలిపారు. ఓటర్ల స్లిప్పులు లాక్కొని, బూత్‌లను ఆక్రమించి రిగ్గింగ్, పైక్లింగ్‌కు పాల్పడ్డారని, వీటికి స్పష్టమైన వీడియో ఆధారాలున్నాయని పేర్కొన్నారు.అయితే, 70 బూత్‌లలో అక్రమాలు జరిగితే, కేవలం 4 బూత్‌లలో మాత్రమే రీపోలింగ్‌కు ఆదేశించడం దారుణమని జగన్ అన్నారు. ఇది ప్రజలను మభ్యపెట్టే కంటితుడుపు చర్య కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వాటిని స్వేచ్ఛాయుత ఎన్నికలు అంటారా? అంటూ ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ తరహా ఘటనలు కేవలం పులివెందులకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా జరిగాయని జగన్ తెలిపారు. కడప, తిరుపతి, కర్నూలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం కార్పొరేషన్లతో పాటు మాచర్ల, కుప్పం, పుత్తూరు, నంద్యాల వంటి అనేక మున్సిపాలిటీల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని... గెలుపు ఆలస్యమైనా అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తాయని ఆయన పునరుద్ఘాటించారు.

వైసీపీలో తీవ్ర మనోవేదన అనుభవించా..11న పార్టీని ప్రకటిస్తా

వైసీపీలో తాను తీవ్రమైన మనోవేదనకు గురైనట్లు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ శ్రేయస్సు, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ పార్టీ అవతరించబోతోందని ఆయన ప్రకటించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 11వ తేదీన కొత్త పార్టీ పేరును వెల్లడిస్తానని స్పష్టం చేశారు.టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు ఓవీ రమణ తన పార్టీలో చేరడం సంతోషంగా ఉందని విజయసాయి రెడ్డి తెలిపారు. తన కొత్త పార్టీలో ఓవీ రమణ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తారని విజయసాయిరెడ్డి వెల్లడించారు. తామిద్దరం గతంలో టీటీడీ బోర్డులో కలిసి పనిచేశామని, ఆ అనుభవంతో పార్టీని ముందుకు తీసుకెళతామని అన్నారు. కాగా, ఓవీ రమణ టీడీపీకి రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. తాను విజయసాయి పార్టీలో చేరుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే, రమణను విజయసాయి తన పార్టీలోకి స్వాగతించారు.ఇక, నవంబర్ 11వ తేదీ, 11 గంటల 11 నిమిషాలకు పార్టీని ప్రకటించడంపై వస్తున్న ట్రోల్స్‌పైనా విజయసాయి స్పందించారు. "పండితులు సూచించిన ముహూర్త బలం ప్రకారమే ఆ సమయాన్ని ఎంచుకున్నాం. ఎవరినీ కించపరచాలనే ఉద్దేశం లేదు. ఎవరో భుజాలు తడుముకుంటే నేను ఏమీ చేయలేను" అని ఆయన వివరణ ఇచ్చారు. తాను మెంటార్‌గా ఉంటూ అన్ని వర్గాల వారికి అధికారం కట్టబెట్టేలా పనిచేస్తానని, ప్రజల ఆశీర్వాదంతో ఏపీలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదుగుతామని విజయసాయి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత అన్ని జిల్లాల నుంచి చేరికలు ఉంటాయని తెలిపారు.

బిల్‌బోర్డ్స్ హ్యాక్.. నీలి చిత్రాల ప్రదర్శన..

- మొదటి పేజీ తరువాయి

ఈజిప్ట్, మలేషియా, బ్రెజిల్, చైనా, ఇరాక్ దేశాల్లోని బిల్‌బోర్డ్‌లను గత వారం హ్యాకర్లు హైజాక్ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో స్క్రీన్లపై ప్రకటనల స్థానంలో అశ్లీల చిత్రాలు దర్శనమిచ్చాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈజిప్ట్ రాజధాని కైరోలో అత్యంత రద్దీగా ఉండే రహదారిపై ఉన్న బిల్‌బోర్డ్‌పై కనిపించిన దృశ్యాలు వాహనదారులను ఒక్కసారిగా షాక్‌కు గురిచేశాయి. కొందరు ఆ దృశ్యాలను రికార్డు చేసి, సోషల్ మీడియాలో షేర్ చేయడంతో హ్యాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. బిల్‌బోర్డ్‌కు సంబంధించిన కంపెనీ వెబ్‌సైట్‌పై సైబర్ దాడి జరిగిందని, అనధికారిక ఫుటేజీ ఒకే సమయంలో పలు దేశాల్లో ప్రసారమైందని ఈజిప్ట్ ప్రభుత్వం వెల్లడించింది. దీనిపై దర్యాప్తు జరుగుతోందని తెలిపింది. అయితే, కంపెనీ పేరు మాత్రం బయటపెట్టలేదు.లోపాలున్న వ్యవస్థలను గుర్తించి, డిజిటల్ బిల్‌బోర్డుల్లోకి చొరబడేందుకు కొన్ని గంటల సమయం మాత్రమే పట్టిందని టెలిగ్రామ్‌లో శామ్‌ఎవతీంవి పేరిట హ్యాకర్ల బృందం ప్రకటించుకుంది. ఎల్ఈడీ స్క్రీన్లకు కంటెంట్‌ను ప్రసారం చేయడానికి ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను వాడుకున్నట్లు చెప్పింది. మలేషియా, బ్రెజిల్‌లోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో యాడ్ సంస్థలు వెంటనే బిల్‌బోర్డులను స్విచాఫ్ చేశాయి.తాము బిల్ బోర్డులను లక్ష్యంగా చేసుకున్నది డబ్బు కోసమో, బెదిరించడం కోసమో కాదని హ్యాకర్లు చెప్పడం గమనార్హం. వారు ప్రకటనల కంపెనీల భద్రతా చర్యలను ఎగతాళి చేశారు. మౌలిక సదుపాయాలపై లక్షల డాలర్లు ఖర్చు చేస్తున్నాయి కానీ.. ఇంటర్నెట్‌తో అనుసంధానించిన స్క్రీన్లను మాత్రం రక్షించుకోలేకపోతున్నారంటూ లోపాలను ఎత్తిచూపారు. తగిన భద్రత లేని స్క్రీన్లను హ్యాక్ చేయగలమని చూపించడమే తమ ఉద్దేశమని, చైనా, ఇరాక్‌లోని బిల్ బోర్డులను టార్గెట్ చేశామని తెలిపారు.

సూరప్పకశం, తండ్లంలో ఎమ్మెల్యే బొజ్జల ఎన్నికల ప్రచారం

- ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం.. ప్రజల సమస్యలపై ఆరా

రేణిగుంట, పెన్ పవర్, నవంబర్ 02:

రేణిగుంట మండలంలోని సూరప్పకశం, తండ్లం గ్రామాల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతుగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూరప్పకశం ఎంపీటీసీ అభ్యర్థి వై. యశోధతో కలిసి కూటమి నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, స్త్రీశక్తి వంటి సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొంటూ ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.





పెన్ పవర్ రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

తుఫాను అత్యవసర సహాయం కోసం 08514-293903కు ఫోన్ చేయండి

- నంద్యాల కలెక్టరేట్‌లో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబరు 02

'మురసు' తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 08514-293903 నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు.

తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల సమీపంలో నిలబడవద్దని సూచించారు. జిల్లాలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



స్విమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి జేఈఓ హామీ

- వేతనాల పెంపు, క్యాడర్ మార్పు, ఉద్యోగ భద్రతపై సానుకూల చర్చలు

- కార్మికుల సర్వసభ్య సమావేశానికి స్వయంగా హాజరవుతా: టీటీడీ జేఈఓ గోపీనాథ్

తిరుపతి, పెన్ పవర్, నవంబర్ 2:

స్విమ్స్ ఆసుపత్రిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, వార్డు బాయ్‌ల సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేస్తామని టీటీడీ జేఈఓ ప్రభల గోపీనాథ్ హామీ ఇచ్చారు. కార్మికుల వేతనాల పెంపు, క్యాడర్ మార్పు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, ఇతర సంక్షేమ సౌకర్యాలపై యాజమాన్యం సానుకూలంగా పరిశీలిస్తోందని తెలిపారు.

సోమవారం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, నేత కె. వేణుగోపాల్, స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జేఈఓను కలిసి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

దీనిపై జేఈఓ స్పందిస్తూ టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ప్రస్తుతం నిర్ణయాలను ప్రకటించలేమని స్పష్టం చేశారు.

అంతేకాకుండా స్విమ్స్ కార్మికుల సర్వసభ్య సమావేశానికి తాను స్వయంగా హాజరై వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జేఈఓ హామీలను సీఐటీయూ నాయకులు స్వాగతిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



తొట్టంబేడులో 107 మంది ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఓటు హక్కు వినియోగం


తొట్టంబేడు,పెన్ పవర్,నవంబర్ 02:

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో నియమితులైన 107 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల విధుల కారణంగా సొంత పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయలేని సిబ్బంది కోసం మండల కేంద్రంలో ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కేంద్రంలో ఉద్యోగులు గోప్యతను పాటిస్తూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారులు సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక బాక్సులు ఏర్పాటు చేసి, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.



బాల్యవివాహాలను అరికడదాం.. బాలికల భవిష్యత్తుకు భరోసా కల్పిద్దాం

- మల్లంగుంట జడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం

తిరుపతి, పెన్ పవర్, నవంబర్ 02:

బాల్యవివాహాలను అరికట్టి బాలికల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని వక్తలు పిలుపునిచ్చారు.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నవంబర్ 2న తిరుపతి మల్లంగుంట జడ్పీ హైస్కూల్‌లో బాల్య సాధికారత, బాల్యవివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ డి. సాయి సుజాత మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల బాలికలు అనేక ఆరోగ్య, ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటారని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న 'బాల్యవివాహ ముక్త్ భారత్' కార్యక్రమాలను వివరించారు.

వన్ స్టాప్ సెంటర్ సైకో సోషల్ కౌన్సిలర్ డాక్టర్ డి. జాహ్నవి మాట్లాడుతూ.. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే ప్రభుత్వ అధికారులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ప్రగతి ఎన్జీవో డైరెక్టర్ కె.వి. రమణ మాట్లాడుతూ.. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు వివాహ వయస్సుగా నిర్ణయించబడిందని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించడం అవసరమని పేర్కొంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం అకాడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ డి. రమణ, డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ వి. జగదీశ్వరి, డాక్టర్ పి. సునీత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





రోడ్డుపై చెత్త కుప్పలు.. దుర్గంధంతో కాలనీవాసుల అవస్థలు

- డంపింగ్ యార్డ్‌గా మారిన తొట్టంబేడు ఆర్‌అండ్‌బీ రహదారి.. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

తొట్టంబేడు, పెన్ పవర్ ,నవంబర్ 02:

తొట్టంబేడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్ఐసీ కాలనీ, చిలక మహాలక్ష్మి ఆలయం ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి చెత్త డంపింగ్ యార్డ్‌గా మారింది. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాళహస్తి సాయిబాబా ఆలయ పరిసరాల్లోని కొందరు దుకాణదారులు వ్యర్థాలను రాత్రివేళ ఇక్కడ పారవేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త కుళ్లిపోవడంతో ఈగలు, దోమలు పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు తక్షణమే స్పందించి చెత్తను తొలగించడంతో పాటు, రహదారిపై చెత్త వేయకుండా పర్యవేక్షణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

జోరు వానలోనూ వైఎస్సార్‌సీపీ ప్రచార జోరు

- జడ్పీటీసీ అభ్యర్థి గంగారి సుజాతతో పాటు ఎంపీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఇంటింటా ప్రచారం

రేణిగుంట, పెన్ పవర్, నవంబర్ 02:

కురుస్తున్న జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రేణిగుంట మండలం తూకివాకం, తండ్లం, కొట్టరమంగళం, సురప్పకసం గ్రామాల్లో జడ్పీటీసీ అభ్యర్థి గంగారి సుజాత, ఎంపీటీసీ అభ్యర్థులు నాగరాజు, హేమలత, దిలీప్‌ల విజయాన్ని కాంక్షిస్తూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ,

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకుడైన రమేష్ సతీమణి గంగారి సుజాతను జడ్పీటీసీగా అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తమ ఓటు ద్వారా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జడ్పీటీసీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో సిద్ధగుంట సుధాకర్ రెడ్డి, తిరుమలరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సంధ్య, ఆనంద్, మునిశేఖర్ రెడ్డి, చిన్నప్ప, శేఖర్ బాబు, శ్రీనివాసులు, పలని, సునీల్, మునిశేఖర్ గౌడ్, సుధాకర్ గౌడ్, మునిరామయ్య, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శివ, ఢిల్లీ బాబు, నవీన్, ప్రవీణ్, సుబ్బు, కూలి రవి, లక్ష్మీనారాయణ, రామ్, చెంగారెడ్డి, క్రాంతి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీహరి, కిరణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.





తొట్టంబేడులో 260 మద్యం బాటిళ్లు స్వాధీనం

- ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసేందుకు అక్రమ నిల్వ.. ఒకరి అరెస్ట్

తొట్టంబేడు,పెన్ పవర్,నవంబర్ 02:

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలో ఎన్నికల సమయంలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన 260 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు.

పోలీసుల కథనం మేరకు.. పెన్నలపాడు గ్రామ హరిజనవాడలో అక్రమంగా మద్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారంతో, శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సెర్చ్ ప్రొసీడింగ్స్ ఆదేశాల మేరకు తొట్టంబేడు ఎస్ఐ ఎం. స్వాతి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిట్టత్తూరు సుబ్రమణ్యం (58) ఇంట్లోని బాత్రూంలో రెండు గోనె సంచుల్లో దాచిన ఆఫీసర్ ఛాయిస్ బ్రాండ్‌కు చెందిన 180 ఎంఎల్ పరిమాణం గల 260 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం 46.80 లీటర్లు కాగా, దాని విలువ సుమారు రూ.36,400 ఉంటుందని పోలీసులు తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు పి. కుమార్ అలియాస్ భాస్కరయ్య మద్యం బాటిళ్లను తనకు అందజేసినట్లు నిందితుడు ప్రాథమిక విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనపై సి ఆర్.సీ.శే.93/2026 కింద బి ఎన్ ఎస్ సెక్షన్లు 173, 223, 3(5)తో పాటు ఏపీ ఎక్సైజ్ చట్టం సెక్షన్ 34(ఏ) ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితుడు సుబ్రమణ్యంను నవంబర్ 1న సాయంత్రం 6 గంటలకు అరెస్ట్ చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఎన్నికల సమయంలో ఓటర్లను మద్యం, నగదు లేదా ఇతర వస్తువులతో ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని, అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



మురసు తుఫాన్ వేగం ఒకవైపు.. జనసేన ప్రచార జోరు మరోవైపు



- జ్ఞానమ్మకండ్రిగలో మునిరాజ నాయుడు ప్రచారానికి సాయి కొట్టే ప్రసాద్ మద్దతు

తొట్టంబేడు, పెన్ పవర్, నవంబర్ 02:

తొట్టంబేడు మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.

జ్ఞానమ్మకండ్రిగ గ్రామంలో జనసేన జడ్పీటీసీ అభ్యర్థి మునిరాజ నాయుడు ప్రచార కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్, ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి, స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు సాయి కొట్టే ప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో కలిసి గ్రామంలో ప్రజలను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకుల చురుకైన భాగస్వామ్యం, కార్యకర్తల ఉత్సాహంతో జ్ఞానమ్మకండ్రిగలో జనసేన ప్రచార సందడి నెలకొంది.మురసు తుఫాన్ వేగాన్ని తలపించేలాజనసేన నాయకులప్రచారపర్యటనలుకొనసాగుతుండడంతో గ్రామంలో రాజకీయ వేడి పెరిగింది.

జోరు వానలోనూ రీపోలింగ్ పరిశీలన

- ఓటింగ్ శాతం తగ్గడానికి కారణాలను విశ్లేషించాలి ఆప్ మేయర్ అభ్యర్థి నీరుగట్టు నగేష్

తిరుపతి, పెన్ పవర్, నవంబర్ 02:

భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తిరుపతి 36వ వార్డు, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎస్ పి జే ఎన్.ఎం) పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న రీపోలింగ్ సరళిని ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థి నీరుగట్టు నగేష్ పరిశీలించారు. వర్షంలోనూ విధులు నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది, పోలీసుల సేవలను అభినందించారు. ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు బాగున్నాయని పేర్కొన్నారు.

ఓటర్లు వర్షాన్ని లెక్కచేయకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్నప్పటికీ, పోలింగ్ శాతం తగ్గడానికి గల కారణాలను విశ్లేషించాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రీపోలింగ్‌కు కారణమైన అధికార పార్టీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించరాదన్నారు. రీపోలింగ్ వల్ల ప్రభుత్వ వనరులు, సమయం వృథా కావడంతో పాటు ఓటర్లు రెండోసారి పోలింగ్ కేంద్రాలకు రావాల్సిన ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్, తిరుపతి ఎస్పీ చర్యలు తీసుకోవాలని నీరుగట్టు నగేష్ కోరారు.



మండలి పోరులో సీపీఎం సమరశంఖం

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా.. చల్లా సరళకు మద్దతుగా ఇంటింటి ప్రచారం

ఏర్పేడు, పెన్ పవర్, నవంబర్ 02:

మండలి పోరులో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పాత వీరాపురం ప్రాదేశిక నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి చల్లా సరళ సోమవారం ఇసుక తాగేలి గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు షేక్ కరీముల్లా మాట్లాడుతూ,

ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టే పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. పేదలు, కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థి చల్లా సరళను గెలిపించాలని పిలుపునిచ్చారు. అధికారం కోసం కాకుండా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసే కమ్యూనిస్టు అభ్యర్థికి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచారంలో సీపీఎం నాయకులు షేక్ కరీముల్లా, రంగయ్య, వెంకటేశ్వరరావు, రాంబాబు, నాగరాజు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



టపాసుల దుకాణాలతో ప్రమాదం పొంచి ఉందా

- ఆసుపత్రి, ఆర్టీసీ గ్యారేజీ, డీజిల్ ట్యాంక్ సమీపంలో విక్రయాలు.. భద్రతా చర్యలపై అధికారుల నిర్లక్ష్యమా

శ్రీకాళహస్తి,పెన్ పవర్, నవంబర్ 02:

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణాలు ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేశారా? ప్రజల భద్రతకు తగిన చర్యలు తీసుకున్నారా? **అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.**

టపాసుల దుకాణాలకు కేవలం 50 మీటర్ల దూరంలోనే ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీ, డీజిల్ ట్యాంక్ ఉండటంతో పాటు, సమీపంలో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఎంజీఎం ప్రైవేటు పాఠశాల, ప్రభుత్వ అన్న క్యాంటీన్, విద్యుత్ సబ్‌స్టేషన్, బీసీ హాస్టల్ ఉన్నాయి. ఇలాంటి కీలక ప్రాంతంలో బాణసంచా విక్రయాలు నిర్వహించడం ప్రమాదకరమనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అగ్నిప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది

టపాసుల విక్రయాలకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు అమలు చేస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత కరువైంది. పండుగ వేళ



కొనుగోలుదారుల రద్దీ పెరిగితే ఆసుపత్రికి అంబులెన్సుల రాకపోకలకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే విక్రయ కేంద్రాలను పరిశీలించాలని, అనుమతులు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు.

వరుస చోరీలకు చెక్..ఇద్దరు కేటుగాళ్లు అరెస్ట్..!!

- రూ.10 లక్షల సొత్తు స్వాధీనం..!!
- 51 గ్రాముల బంగారం,111 తులాల వెండి,రూ.54 వేల నగదు రికవరీ..!!
- 34 కేసుల్లో నేర చరిత్ర ఉన్న నిందితుడి గుట్టురట్టు..!!

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 02

..నంద్యాల జిల్లా..

..నంద్యాల పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ సుస్మిత రామనాథన్, ఐపీఎస్ వెల్లడించారు.నంద్యాల తాలూకా,రెండో పట్టణం,మూడో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన పలు చోరీ కేసులను ఛేదించి,నిందితుల నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు..!!

..సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏఎస్పీ సుస్మిత రామనాథన్ ఐపీఎస్ మాట్లాడుతూ..జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో జరిగిన వరుస దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.తాలూకా,నంద్యాల-2 టౌన్,నంద్యాల-3 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులను సమన్వయంతో దర్యాప్తు చేసి,ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు..!!

..నిందితుల నుంచి సుమారు 51 గ్రాముల బంగారు ఆభరణాలు,111 తులాల వెండి ఆభరణాలు,రూ.54 వేల



నగదును స్వాధీనం చేసుకున్నామని,చోరీలకు ఉపయోగించిన ఏపీ 04 ఏఎస్ 9953 నంబరు గల పల్సర్ ద్విచక్ర వాహనాన్ని కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని ఏఎస్పీ సుస్మిత రామనాథన్ వెల్లడించారు..!!

..ఈ కేసుల్లో ప్రధాన నిందితుడికి గతంలోనే కర్నూలు,నంద్యాల జిల్లాల పరిధిలో సుమారు 34 కేసులతో నేర చరిత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైందని ఏఎస్పీ తెలిపారు.అయినప్పటికీ నేర ప్రవృత్తిని వీడకుండా మరోసారి దొంగతనాలకు పాల్పడినట్లు వివరించారు.పాత నేరస్థుల కదలికలపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా ఉంచుతోందని,నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు..!!



..జిల్లాలో ఆస్తి నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని,ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి,ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారు కోరారు..!!

..ఈ కేసుల ఛేదనలో నంద్యాల తాలూకా సీఐ ఆర్.ఈశ్వరయ్య,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.సురేష్ కుమార్,సంబంధిత పోలీస్ సిబ్బంది కీలకంగా వ్యవహరించారని ఏఎస్పీ సుస్మిత రామనాథన్ అభినందించారు..!!

..పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే వరుస చోరీ కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేయగలిగామని ఆమె పేర్కొన్నారు..!!

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పెద్ద కనపర్తి విద్యార్థిని



- ప్రతిభావంతులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు.. ఎస్‌కే షర్మిలకు అభినందనల వెల్లువ

తొట్టంబేడు, పెన్ పవర్, నవంబర్ 02:

ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దడంలో పెద్ద కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్‌కే షర్మిల అండర్-14 బాలికల వాలీబాల్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.

ఇటీవల అంజూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో షర్మిల ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సుబ్రహ్మణ్యం, వ్యాయామ దర్శకులు ఎం. చెంగల్ రాయులు తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఆమె పాల్గొననుంది.

విద్యార్థిని షర్మిలను పాఠశాల ఉపాధ్యాయులు ఓ. ప్రసాద్, ఫౌజియా, నాగరాజా, కె. మునుస్వామి, ఎన్. గోపాల్, టి. జరీనా, సరిత, పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్. చలపతి తదితరులు అభినందించారు.

ఈ సందర్భంగా పెద్ద కనపర్తి గ్రామ పూలే-అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకులు డా. శ్రీనివాస్, కమిటీ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ప్రధానోపాధ్యాయులు పి. సుబ్రహ్మణ్యం, వ్యాయామ దర్శకులు చెంగల్ రాయులు, ఇతర ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందం పాఠశాలలో ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

మనే కుర్తి, మరకట్టు, అంగస్కల్ గ్రామాలలో టిడిపి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా వైకుంఠం జ్యోతి శివప్రసాద్ విస్తృత ప్రచారం.

పెన్ పవర్, నవంబర్ 03

ఆలూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఓపొందుకుంది ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారాన్ని మరింత విస్తృతం చేస్తూ ఆలూరు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి శివప్రసాద్ మనేకుర్తి, మరకట్టు, అంగస్కల్ గ్రామాలలో పర్యటించి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీమతి వైకుంఠం జ్యోతి శివప్రసాద్ గ్రామాల్లోని ప్రజలు మహిళలు యువత పెద్దలను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. స్థానిక సంస్థల ఎన్నికల గ్రామాల అభివృద్ధికి ఎంతో కీలకమని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసే ప్రతినిధిలను ఎన్నుకోవడం అవసరమనే ఆమె పేర్కొన్నారు. టిడిపి అభ్యర్థులకు మద్దతు తెలపాలని ఆమె ప్రజలను కోరారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ అభ్యర్థుల తరపున ఓటర్లను కలుసుకోవడంతోపాటు స్థానికంగా నెలకొన్న సమస్యలు గ్రామాల అభివృద్ధి కి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రజలతో చర్చించారు. ప్రజల నుంచి



వచ్చే సూచనలు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులు కార్యకర్తలతో మాట్లాడి వైకుంఠం జ్యోతి శివప్రసాద్ ప్రతి గ్రామంలో ప్రచారాన్ని సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. నాయకులు కార్యకర్తలు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఓటర్లు నేరుగా కలిసి పార్టీ అభ్యర్థుల గురించి వివరించాలని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామస్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచుకుంటూ ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రజలతో మరింత అనుసంధానం కావాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. మన కుర్తి మరకట్టు అంగస్కల్ గ్రామాల్లో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. శ్రీమతి వైకుంఠం జ్యోతి శివప్రసాద్ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రచారం నిర్వహించడంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అభ్యర్థి కొమ్ము రామాంజనేయులు, ఎంపీటీసీ అభ్యర్థి కోటి లక్ష్మి, నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

హోరు వానలోనూ కాంగ్రెస్ ప్రచార జోరు





- బాలగురవం ఝాన్సీ గెలుపే లక్ష్యంగా సత్యవేడులో ఎన్నికల ప్రచారం

శ్రీకాళహస్తి, పెన్ పవర్,నవంబర్ 02:

హోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సత్యవేడు మండల జడ్పీటీసీ అభ్యర్థి బాలగురవం ఝాన్సీ విజయమే లక్ష్యంగా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు ఆధ్వర్యంలో సత్యవేడు పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు.

ఈ సందర్భంగా బాలగురవం బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని, పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతుండటం సంతోషంగా ఉందన్నారు. ప్రజల ఆదరణతో బాలగురవం ఝాన్సీ విజయాన్ని సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, కేకేసీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం చిరంజీవి, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో 23వ వార్డులోరీపోలింగ్ ప్రారంభం

- భారీ పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ ప్రారంభం 23వ వార్డు

పెన్ పవర్, నవంబర్ 03

వివరాలివేమాచర్ల పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డులోని 23/1, 23/2 రెండు పోలింగ్ బూత్ లలో సోమవారం రీపోలింగ్ పోలీస్ భారీ బందోబస్తు మధ్య పోలింగ్ ప్రారంభంఅయింది.23వ వార్డులో మొత్తం 1213 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 562 మంది, మహిళలు 651 మంది ఓటర్లుగా ఉన్నారు. ఆదివారం జరిగిన పోలింగ్ సమయంలో 2 గంటల పాటు సీసీ కెమెరాలు ఆపివేయటంతో పాటు పలు అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు నేపథ్యంలో రీపోలింగ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు, ఏర్పాటు చేశారు. ఓటరు స్లిప్పు ఉన్నవారిని పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఇస్తున్నారు.



నంద్యాల మున్సిపల్ ఎన్నికలు 62.49 శాతం పోలింగ్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 02



నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో 62.49 శాతం పోలింగ్ నమోదైందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. నవంబర్ 3న పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని వెల్లడించారు. మొత్తం 9 హాళ్లలో 78 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేశామని, వీటిలో 52 వార్డులకు 52 టేబుళ్లు, చైర్‌పర్సన్ ఎన్నికకు 26 టేబుళ్లు కేటాయించామని వివరించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, అనంతరం సాధారణ బ్యాలెట్లను లెక్కిస్తామన్నారు. కనీసం నాలుగు రౌండ్లలో కౌంటింగ్ జరుగుతుందని, పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఓటర్లు, రాజకీయ పార్టీలు, అధికారులకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

నిఘా నీడలో హరిదాస్ నగర్ గ్రామం.

- కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా 08 సీసీ కెమెరాల ఏర్పాటు.
- సీసీ కెమెరాలను ప్రారంభించిన సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి.

పెన్ పవర్, నవంబర్ 03

ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా గ్రామ పంచాయతీ సహకారంతో ఏర్పాటు చేసిన 08 సీసీ కెమెరాలను సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి ఈరోజు ప్రారంభించారు.ఈ సందర్భంగా నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ...కమ్యూనిటి మరియు నేను సైతం పోసిలింగ్ లో భాగంగా ప్రజల



భాగస్వామ్యంతో జిల్లాలో నిరంతరంగా కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ గ్రామాలు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.నేరాల నియంత్రణ, నేరాలకు పాల్పడిన నిందితులను త్వరగా గుర్తించడం, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

ఆధునికసాంకేతికపరిజ్ఞానాన్నివినియోగించు కుంటూ నేరాలను అరికట్టడంతో పాటు నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.గ్రామాల భద్రత ప్రజలందరి బాధ్యత అని, పోలీసులకు ప్రజలు సహకరిస్తూ నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డీఎస్పీ కోరారు. ఈకార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ సిఐ వెంకటేష్, ఎస్.ఐ రమేష్ , గ్రామపంచాయతీ పాలక వర్గం , మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య,ఏఏంసీ వైర్మెన్ దేవానందం,వైస్ వైర్మెన్ నంది కిషన్,పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

నేడు పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు సెలవు :

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు, నవంబర్ 02 :(పెన్ పవర్):

మురసు తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నవంబర్ 03న (మంగళవారం) అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అంగన్వాడీ పాఠశాలలు, అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.



ఎల్ నినో ప్రభావంతో ఆరుతడి పంటలను సాగు చేయాలి

- వ్యవసాయ శాఖఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమం

పెన్ పవర్, నవంబర్ 03

వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలోని 02-11-2026 రోజున గ్రామపంచాయతీ వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్"కార్యక్రమాన్నినిర్వహించారు.ఎల్‌నినోప్రభావాలు మరియు భూగర్భ జలాల లభ్యతను దృష్టిలో ఉంచుకొని, రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు మరియు నూనెగింజల పంటలను తక్కువ నీటితో సాగు చేసిపంటలనుప్రోత్సహించాలనిసూచించారు.నీటివనరులను సమర్థవంతంగావినియోగించు కుంటూ పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని రైతులకు ఏ.ఈ.ఓ ఎస్ సాయిరాం రాజు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ ఎస్.సాయిరాం రాజు, సర్పంచ్ వనిత రాజ్ కుమార్,ఉపసర్పంచ్ వెంకట్ గౌడ్,వార్డు సభ్యులుపంచాయతీ సెక్రెటరీ రాజ్ కుమార్, కారోబార్



సంజీవ్,ఫీల్డ్ అసిస్టెంట్ రాకేష్ మోహన్,మరియు రైతులు పాల్గొన్నారు.

గొట్టిపాడు గ్రామంలో 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక.. ఎమ్మెల్యే రామాంజనేయులు



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 2,

ప్రత్తిపాడు మండలం , గొట్టిపాడు గ్రామంలో గుంటుపల్లి దేవేంద్రబాబు గారి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మొత్తం 30 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా.బూర్ల రామాంజనేయులు పార్టీ కండువాలు కప్పి వారిని తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై, ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామాంజనేయులు నాయకత్వంలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనే సంకల్పంతో పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని, కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లోవిశ్వాసంబలపడుతోందని,తెలుగుదేశం పార్టీ ప్రజల విశ్వాసంతో ముందుకు సాగుతోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలు ఆచంట సునీత , రాష్ట్ర రైతు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు గారు, మండల పార్టీ అధ్యక్షులు గింజుపల్లి శివరామ్ ప్రసాద్ గ్రామ నాయకులు, గుంటుపల్లి దేవేంద్ర బాబు , ఆలపాటి పాండురంగారావు , నాగేశ్వరరావు, కోటేశ్వరరావు ,అభిమానులు, కార్యకర్తలు,మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

ఆకుమర్రులో కూటమి ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన



గూడూరు, పెన్ పవర్, నవంబర్2

గూడూరు మండలం ఆకుమర్రు గ్రామంలో కూటమి అభ్యర్థులు నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గూడూరు మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థిని చూడం నాంచారమ్మ, రామరాజుపాలెం ఎంపీటీసీ అభ్యర్థి బొల్లా రాజేష్ కూటమి నాయకులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి గ్రామ ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు అభ్యర్థులకు స్వాగతం పలుకుతూ తమ మద్దతు ప్రకటించారు. గ్రామంలో కూటమి శ్రేణుల ప్రచారంతో రాజకీయ సందడి నెలకొంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఈ ప్రచార కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోపి నాగబాబు, ప్రధాన కార్యదర్శి తోట వేణు, చోడగం శ్రీనివాసరావు, ఎన్.ఏ. బేగ్, గోళ్ల తేజ, గంజాల కృష్ణమోహన్, సంకుల శ్రీరామకృష్ణ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేటలో ప్రజాస్వామ్యం ఖూనీ: మాజీ మంత్రి విడదల రజిని ధ్వజం



చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 02 :

చిలకలూరిపేట స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అండతో టీడీపీ శ్రేణులు కర్రలు, రాడ్లతో పోలింగ్ కేంద్రాలపై పడి బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, మహిళా ఏజెంట్లపై దాష్టీకాలకు దిగినా పోలీసులు వారికే కొమ్ముకాశారని ఆమె మండిపడ్డారు. నామినేషన్ల అడ్డంకులు, విపక్ష నేతలపై లాఠీఛార్జీలు, మీడియా ప్రతినిధులపై దాడులతో భయోత్పాతం సృష్టించారని ధ్వజమెత్తారు. ఈ అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, నిందితులపై చర్యలు తీసుకుని రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ, ఎన్ని బెదిరింపులు ఎదురైనా రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రజాపక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

పేట మున్సిపల్ కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు: అర్బన్ సీఐ రమేష్

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 02 :



చిలకలూరిపేట పట్టణంలోని ఏఎంజీ ఆవరణలో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అర్బన్ సీఐ పి. రమేష్, బందోబస్తు విధుల్లో పాల్గొనే ఎస్సైలు, ఏఎస్సైలు మరియు పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు, సలహాలు అందించారు. కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ స్పష్టం చేశారు.

పేట - ఓడరేవు రహదారిపై ప్రమాదం: ఒకరికి తీవ్ర గాయాలు

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 02 :



చిలకలూరిపేట – ఓడరేవు ప్రధాన రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ సమీపంలో హైవే దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని ఓ కారు అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న పురుషోత్తమపట్నం గ్రామానికి చెందిన ఉప్పాల ముకుందరావు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

పేదల కడుపు కొడుతున్న బియ్యం దందాగోళ్లపై విజిలెన్స్ పంజా

అధికారుల రాకతో దుకాణాలు మూసి వ్యాపారుల పరార్!

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 02 :

చిలకలూరిపేటలో నిత్యావసరమైన బియ్యాన్ని అధిక ధరలకు అమ్ముకుంటూ సామాన్యుల రక్తం తాగుతున్న దళారులు, వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ప్రభుత్వంనిర్ణయించిన ధరలకు తిలోదకాలిచ్చి, కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తున్నారన్న పక్కా సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. ప్రధాన వ్యాపార కేంద్రాలు, గోదాములపై అధికారులు ఆకస్మికంగా పిడుగులా పడటంతో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది. తనిఖీల విషయం క్షణాల్లో దావానలంలా వ్యాపించడంతో, పట్టుబడితే జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందన్న భయంతో పలువురు వ్యాపారులు దుకాణాలు, గోదాములకు తాళాలు వేసి తోకముడిచి పరారయ్యారు.

కేవలం తనిఖీలతో సరిపెట్టి వదిలేస్తే ఈ దోపిడీ ఆగదని, ప్రజల కడుపు కొట్టి కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్న సదరు అక్రమ వ్యాపారుల బండారాన్ని బట్టబయలు చేసి, వారి పేర్లను బహిర్గతం చేయాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నిల్వలు, లావాదేవీల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, బ్లాక్ మార్కెట్ దందాను శాశ్వతంగా అణచివేయాలని, పారిపోయిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దాడులతో గుట్టుచప్పుడు కాకుండా పారిపోయిన ఆ బడా వ్యాపారులు ఎవరు? వారి వెనుక ఉన్న అదృశ్య శక్తులెవరు? అన్నది ఇప్పుడు పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పోతవరంలో ఘనంగా హజ్రత్ అబ్దుల్లా బాషా 75వ ఉరుసు మహోత్సవం

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 02 :

చిలకలూరిపేటమండలంపోతవరంగ్రామంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త హజ్రత్ మౌలానా మౌల్వీ మొహమ్మద్ అబ్దుల్లా బాషా 75వ ఉరుసు మహోత్సవం అత్యంత వైభవంగాజరిగింది. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని అబ్దుల్లా బాజీ బాబా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జర్నలిస్ట్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా



హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. సమాజంలో సర్వమత సామరస్యం, ఆధ్యాత్మికచింతనఅవసరమని, పీర్ల ఉరుసు ఉత్సవాలు భక్తిభావానికి,ఐక్యతకుప్రతీకగానిలుస్తాయనిపేర్కొన్నారు .పేదలకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమైన కార్యమని, సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు.

వైసీపీ ఉచ్చులో పడకండి: ప్రత్తిపాటి

కూటమి మధ్య చిచ్చు పెట్టడానికి జగన్, వైసీపీనేతలు ఎంతకైనా తెగిస్తారు.

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 02 :

48 వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయం, భారీ మెజారిటీయే లక్ష్యంగా మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో బాగా పనిచేశారని, కూటమిపార్టీల మధ్య చిచ్చు పెట్టడానికి జగన్, వైసీపీనేతలు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారని, ఎంతకైనా తెగించడానికి వారు సిద్ధంగా ఉన్నారని, వారి ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.



సోమవారం సాయంత్రం ఆయన స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్ లో కూటమిపార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు, కీలక నేతలకు ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు కీలక సూచనలు చేశారు.

మున్సిపాలిటీలో తప్పకుండా విజయం సాధిస్తామని, ఎవరూ ఎలాంటి ఒత్తిడికి గురికావాల్సిన పనిలేదని, ప్రచారంలో మనందరం పడిన కష్టానికి తగిన ప్రతిఫలం తప్పకుండా పొందుతామని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు వేళ.. ప్రత్యర్థి వర్గం రెచ్చగొట్టే ధోరణితో ఉంటుందని, కూటమి శ్రేణులు ఎవరూ వారి ట్రాప్ లో పడకూడదని, దృష్టంతా ఓట్ల లెక్కింపు, మన అభ్యర్థుల మెజారిటీపైనే పెట్టాలన ప్రత్తిపాట సూచించారు. మిత్రధర్మానికి కట్టుబడి అందరం ప్రజాక్షేమమే లక్ష్యంగా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ పట్ల విధేయత, ప్రజలకు సేవ చేయాలన్న తపన అధికంగా ఉన్నవారికి కౌన్సిలర్లుగా అవకాశం కల్పించామని, విజయం సాధించాకే వారి బాధ్యత మరింత పెరుగుతుందని ప్రత్తిపాటి చెప్పారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో పనిచేసేవారికి ఏ పార్టీలో ఉన్నా మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. ఎన్ని ఒత్తిడులు, అవమానాలు ఎదురైనా వాటన్నింటినీ ఓర్పు, సహనంతో ఎదుర్కోవాలన్నారు. కౌన్సిలర్లందరూ పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తొలిసారి ఛైర్ పర్సన్ అవుతున్న తోట రాజరాజేశ్వరికి అన్ని విధాల సహాయసహకారాలు అందించాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ సమావేశంలో జనసేన ఇంచార్జి తోట రాజరమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ క్లస్టర్ నాయకులు మద్దిబోయిన శివ, షేక్ మస్తాన్ వలి, ముల్లా కరిముల్లా, మురకొండ మల్లిబాబు, షేక్ అబ్దుల్ ఖుమీర్, వహాబ్, గంగా శ్రీనివాసరావు, ఈవూరి బ్రహ్మానందం, మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులు, కూటమి నాయకులు, బూత్ ఏజెంట్ లు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో ఘనంగా జమ్మి చెట్టు పూజ: ప్రత్తిపాటి వెంకటకుమారి

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 02 :

చిలకలూరిపేట: పట్టణంలోని 52 ఎకరాల టిడ్కో హౌసింగ్ కాలనీలో సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దేవాలయ నిర్మాణ ప్రాంగణంలో జమ్మి చెట్టు పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి శాసనసభ్యులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి ప్రత్తిపాటి వెంకటకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి తన చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆమె, వారి



యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భక్తులకు జమ్మి చెట్టు విశిష్టతను, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరించారు. ఈ పవిత్ర పూజ ద్వారా టిడ్కో కాలనీలోని సర్వదోషాలు తొలగిపోయి, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దైవాన్ని ప్రార్థించినట్లు ప్రత్తిపాటి వెంకటకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు, నాయకులు ఇట్టే శివ నాగేశ్వరరావు, మల్లెల శివ నాగేశ్వరరావు, నెల్లూరి ఈశ్వర్ రంజిత్, ఆచ్చుకోల మురళితో పాటు కూటమి, తెదేపా, బీజేపీ నాయకులు, కాలనీ భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

వెలగలేరు రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్,నవంబర్ 2:



మురసు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం, ఎగువ ప్రాంతాల నుంచి వెలగలేరు రెగ్యులేటర్‌కు భారీగా వరద నీరు చేరే ప్రమాదం నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రత్యేక ముందస్తు అప్రమత్తత చర్యలు చేపట్టారు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద నిరంతర పర్యవేక్షణ కోసం రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు మూడు రోజుల పాటు షిఫ్టుల వారీగా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రెగ్యులేటర్ వద్ద నీటిమట్టం, వరద ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలని సూచించారు.నీటిమట్టం అకస్మాత్తుగా పెరిగినా, వరద ప్రవాహంలో అసాధారణ మార్పులు చోటుచేసుకున్నా వెంటనే తహసీల్దార్‌తో పాటు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు వరద ప్రవాహం,నీటివిడుదలకు సంబంధించిన సాంకేతిక సమాచారాన్నిపర్యవేక్షణబృందాలకుఅందించాలన్నారు.ా ంవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలు, ముంపు ముప్పు ఉన్న గ్రామాలప్రజలనుఅవసరమైనసందర్భాల్లోముందుగానే అప్రమత్తంచేయాలని ఆదేశించారు.తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పర్యవేక్షణ బృందాలు వెలగలేరు రెగ్యులేటర్ వద్ద అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. తుపాను ప్రభావం దృష్ట్యా అధికారులు అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఇంధన పొదుపుపై ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అవగాహన కార్యక్రమం

గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 2:

బీఆర్ఐసీఎస్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా గుంటూరు నగరంలోని నాగారంపాలెం, కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ కళాశాల ప్రాంగణంలో ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం “ఇంధనాన్ని ఆదా చేద్దాం” అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణ ఇంజినీర్ ఎం.డి. నజీనా బేగం మాట్లాడుతూ, ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యుత్ వృథాను అరికట్టాలని, అవసరం లేనప్పుడు విద్యుత్ పరికరాలను ఆపివేయాలని, తక్కువ విద్యుత్



వినియోగించే పరికరాలను ఉపయోగించాలని సూచించారు. ఇంధన పొదుపు ద్వారా సహజ వనరులను కాపాడటంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ సహాయ సంచాలకులు శ్రీనివాస్, శిక్షణా బాధ్యులు రవికుమార్, నారాయణ బృందం, పర్యావరణ సమన్వయకర్త డి. తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంధన పొదుపు, విద్యుత్ వనరుల సమర్థ వినియోగం, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. చిన్న చిన్న పొదుపు చర్యల ద్వారా కూడా పర్యావరణ పరిరక్షణకు గణనీయమైన తోడ్పాటు అందించవచ్చని, ఇంధన పొదుపును ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని కార్యక్రమంలో అవగాహన

బుడమేరు పరివాహక ప్రాంతంలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన





విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 2,

రాష్ట్రంలో ముంచుకొస్తున్న ‘మురసు’ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. బుడమేరు క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ నివేదికల దృష్ట్యా, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సోమవారం సాయంత్రం బుడమేరు పరివాహక ప్రాంతంలోని గూడవల్లి, ఎనికేపాడు ప్రాంతాలలలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా బుడమేరు ప్రవాహ తీరును, గట్లను, క్షేత్రస్థాయి పరిస్థితులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరినా ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు కలగకుండా తూములు, వంతెనల వద్ద గుర్రపుడెక్క, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. బలహీనంగా ఉన్న కరకట్టల వద్ద ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గేంతవరకు బుడమేరు లోతట్టు, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార యంత్రాంగం రౌండ్ ది క్లాక్ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని మాత్రమే గమనించాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అపోహలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసర సమాచారం ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్.91549 70454 కు సమాచారం అందించాలని తెలిపారు.కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ బి.సుగుణ, ఇరిగేషన్ డిఈ కె.బాబు,జెఈ రాజశేఖర్, తదితరులు ఉన్నారు


తుఫాను ముప్పు వేళ యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 2,

సోమవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, వైద్య, విద్యుత్, ఇరిగేషన్ తదితర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, పూరిళ్లలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. క్యాంపుల్లో ఆశ్రయం పొందుతున్న వారికి నేటి రాత్రి నుంచే భోజనం, తాగునీరు, వసతి వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణులు ముఖ్యంగా ప్రసవానికి సమీపంలో ఉన్నవారు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులను ముందుగానే సమీప ఆరోగ్య కేంద్రాలు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మండల కేంద్రాల్లో, కలెక్టరేట్‌లో 24/7 కాల్ సెంటర్లు, అత్యవసర స్పందన కేంద్రాలు నిరంతరం పనిచేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, వర్షం, చెట్లు కూలడం, ముంపు వంటి వివరాలపై ప్రతి గంటకూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. ప్రతి మండలంలో ట్రాక్టర్లు, జేసీబీలు, టెంపోలు, రోప్‌లు, పవర్ సాస్, టార్చ్ లైట్లతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల రహదారులపై చెట్లు విరిగిపడినా లేదా విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా అరగంట వ్యవధిలోనే ట్రాఫిక్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని మైనర్ ఇరిగేషన్ చెరువులు, ట్యాంకుల పరిస్థితిని ఇరిగేషన్, రెవెన్యూ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. 100 శాతం నిండిన చెరువుల కట్టలు తెగిపోకుండా ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే పూర్తిస్థాయిలో నిండని చెరువుల్లోకి వర్షపు నీరు చేరేలా ఇరిగేషన్ ఏఈ, డీఈలు చర్యలు చేపట్టి సుమారు 2 నుంచి 3 టీఎంసీల వరకు నీటిని ఒడిసిపట్టేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. తాగునీటి క్లోరినేషన్ నిరంతరం జరగాలన్నారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలన్నారు. రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉన్న మారుమూల గ్రామాలు, లంక గ్రామాల్లో రేషన్, నిత్యావసర సరుకుల నిల్వలు ముందస్తుగానే అందుబాటులో ఉండేలా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యంగా ప్రతి శాఖ సమన్వయంతో,
బాధ్యతాయుతంగా పనిచేసి నష్టం వాటిల్లకుండా చూడాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం కమిషనర్ మయూర్ అశోక్





గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 2:

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. నవంబర్ 3వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపును పారదర్శకంగా, వేగవంతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ వెల్లడించారు.ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం కమిషనర్ పరిశీలించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు వి.వీర బ్రహ్మయ్యతో కలిసి కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుంటూరు నగరంలోని 76 వార్డులకు సంబంధించి 596 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్ల లెక్కింపు కోసం 50 హాళ్లలో 468 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు విధుల నిర్వహణకు 1,404 మంది శిక్షణ పొందిన సిబ్బంది, అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు.
పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి అధికారిక ఏజెంట్లు నవంబర్ 3వ తేదీ ఉదయం 6 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీల్స్ తెరిచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు.కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్లను అనుమతించబోమని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్ల భద్రత కోసం కౌంటింగ్ కేంద్రాల వెలుపల ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.కౌంటింగ్ సిబ్బంది, అధికారుల సౌకర్యార్థం తాగునీరు, అల్పాహారం, భోజన వసతులతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, వేగవంతంగా పూర్తయ్యేందుకు అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది సహకరించాలని కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు.

మురసు తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి -- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, పెన్ పవర్,నవంబరు 2:

మురసు తుఫాన్ ప్రభావంతో పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు చేరే అవకాశం ఉందని, బ్యారేజీ నుంచి దిగువకు నీటిని విడుదల చేసే పరిస్థితులు ఉన్నందున కృష్ణా తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సూచించారు. మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లోని కృష్ణా తీర గ్రామాలతో పాటు లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.
మురసు తుఫాన్ నేపథ్యంలో జిల్లా, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, విపత్తు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల స్థాయి కంట్రోల్ రూమ్‌లు కూడా 24 గంటలు పనిచేయాలని ఆదేశించారు.
మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, 20 నుంచి 30 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాగులు, వంకలు, చెరువులు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని సూచించారు. చేపల వేటకు కూడా వెళ్లవద్దని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల వద్దకు వెళ్లకూడదని, వాటిలో నివసించరాదని తెలిపారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తాకవద్దని ప్రజలకు విజ్ఞప్తి



చేశారు.జలవనరుల శాఖ ప్రతి గంటకు వరద పరిస్థితిపై నివేదిక సమర్పించాలని, ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వాగులు, కాలువల ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బలహీనంగా ఉన్న నది గట్లను గుర్తించి, అవసరమైన చోట ఇసుక బస్తాలను సిద్ధం చేయాలని సూచించారు. పరిస్థితులను బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి, నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.
తుఫాన్ కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలి రవాణాకు ఆటంకం కలగకుండా ట్రీ కట్టర్లు, పవర్ సా పరికరాలను సిద్ధంగా ఉంచాలని రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీటి పథకాల వద్ద జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షించాలని తెలిపారు.జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని, చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకులను నిల్వ ఉంచాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహార పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, రైతులను అప్రమత్తం చేసి వ్యవసాయ, ఉద్యాన పంటల రక్షణకు తగిన సూచనలు అందించాలని తెలిపారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వాటికి ఆహారం అందేలా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ఆసుపత్రుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు
ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్ల వద్ద విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధిక ప్రమాద స్థితిలో ఉన్న గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. టెలికాం, మొబైల్ సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత సంస్థలు ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.
జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మురసు తుఫాను ప్రభావం నేపథ్యంలో నవంబర్ 3న ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు కలెక్టర్ జి.లక్ష్మీశ.

విజయవాడ: పెన్ పవర్,నవంబర్ 2,



మురసుతుఫాను ప్రభావంతో మంగళవారం నవంబర్ 3వ తేదీ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు నవంబర్ 3వ తేదీన సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఆదేశాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

3వ తేదీ సాయంత్రం నుండి మద్యం దుకాణాలు బంద్ కలెక్టర్ .యం.సాయికాంత్ వర్మ

గుంటూరు, పెన్ పవర్,నవంబరు 2 ,

జడ్పిటిసి,ఎంపిటిసిఎన్నికల సందర్భంగా మద్యం దుకాణాలు ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి విక్రయాలు నిలుపుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ నవంబరు 5వ తేదీన జరుగుతున్నందున, నిబంధనల మేరకు విక్రయాలు నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.
జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నవంబరు 5వ తేదీన



కౌంటింగ్ ఉన్నందున, 48 గంటల ముందు నుండి మద్యం విక్రయాలు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల నిబంధనలు, సంబంధిత చట్టాలకుఅనుగుణంగాచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.సైలెంట్ పీరియడ్ పాటించాలి పోలింగ్ కు ముందు 48 గంటల సైలెంట్ పీరియడ్ విధిగా పాటించాలన్నారు. బి.ఎన్.ఎస్ 163 ను పోలింగ్ కేంద్రాల వద్ద అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల లోపల ఎవరు ఉండరాదన్నారు. పోలింగ్ రోజు, నవంబరు 5వ తేదీన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు గోప్యతను విధిగా పాటించాలన్నారు.

కేజీబీవీలో విద్యార్థిని మృతి ఘటనపై స్పందించిన ఏపీ మహిళా కమిషన్.

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 2,

చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ ఆదేశాల మేరకు విద్యార్థిని మృతికి గల కారణాలపై ఆరా తీసిన మహిళా కమిషన్ బృందం.విద్యార్థినికి చదువుపై ఆసక్తి లేదని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చదువు కొనసాగించేలా చేశామని తండ్రి వెల్లడి అనకాపల్లి జిల్లా జి.కొత్తపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న జాజిమొగ్గల ఉషశ్రీ హాస్టల్ గదిలో



మృతి చెందింది. విద్యార్థిని ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు సమాచారం.
విద్యార్థిని చేతిపై మృతికి సంబంధించిన కారణాలు రాసి ఉన్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. అయితే విద్యార్థిని మృతికి గల అసలు కారణాలు ఇంకా తెలియరాలేదు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. పూర్తి స్థాయి విచారణ అనంతరం విద్యార్థిని మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.
కేజీబీవీ హాస్టల్‌లో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.

మాచర్లలో ఓటు హక్కు వినియోగించుకున్న పుడా చైర్మన్ చిరుమామిళ్ల

పెన్ పవర్, నవంబర్ 03

మాచర్ల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆదివారంపుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు స్థానికజడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కునువినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు వికలాంగులకు, వయోవృద్ధులకు వీల్ చైర్స్ ఏర్పాటు చేశారన్నారు. ఒక మంచి ప్రభుత్వానికి ఓటు



వేయండి అని ఓట్లకు పిలుపునిచ్చారు.

బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటరు తీర్పు- వైఎస్ఆర్సీపీకి ఫలితాలు కీలకం

విజయవాడ, నవంబర్ 2, పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ పర్వం ముగిసింది. మున్సిపల్ పరిధిలోని పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ప్రధాన అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రమైంది. క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం , పోలింగ్ సరళిని విశ్లేషిస్తే.. ఎన్నికల సమరం దాదాపు ఏకపక్షంగానే సాగిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికార ఎన్డీయే కూటమి సమన్వయంతో, అత్యంత ఉత్సాహంగా ఓటర్లను పోలింగ్ బూతులకు తరలించగలిగితే, వైఎస్సార్సీపీ శ్రేణులు మాత్రం మొదటి నుంచి ఆ స్థాయి వ్యూహాత్మక ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోయాయని భావిస్తున్నారు.వాస్తవానికి ఈ పురపాలక సమరంలో పోటీకి దిగడంపై వైఎస్సార్సీపీ కేడర్‌లో ప్రారంభికంగా కొంత సందేహాలు నిలిచాయి. ఓటమి చవిచూసిన తర్వాత ఏర్పడిన నిరాశ, ఆర్థిక , లీగల్ ఒత్తిళ్ల కారణంగా పోటీకి దిగేందుకు స్థానిక నేతలు వెనుకాడారు. అయితే, పార్టీ ఉనికిని చాటుకోవడానికీ, కేడర్ చేజారకుండా చూడటానికి ఎన్నికల బరిలో నిలవాల్సిందేనని అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీలో నిలిచారు. పోటీపడినప్పటికీ గెలుపును నిర్దేశించే ఎలక్షన్ మేనేజ్‌మెంట్ , నిధుల సమీకరణ , ముమ్మర ప్రచారంలో అధికార కూటమిని ఢీకొట్టే స్థాయిలో వైసీపీ సీరియస్‌గా దృష్టి సారించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. స్థానిక నాయకత్వంపై రకరకాల ఒత్తిళ్లు ఉండటం, అనేక ప్రాంతాల్లో నామినేషన్ల ఘట్టం నుంచి ప్రచారం దాకా అనుకున్న స్థాయిలో సహకారం లభించకపోవడం వల్ల ఈ పుర ఎన్నికల్లో వైసీపీకి ప్రతికూల ఫలితాలు వస్తాయనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, రాయలసీమలోని కొన్ని కంచుకోటలు, కడప, పులివెందుల, ఉమ్మడి ఉమ్మడి జిల్లాలలోని సొంత సీట్లతో పాటు పట్టణాల్లోని పేద వర్గాల ఓటు బ్యాంక్ తమను గట్టెక్కిస్తుందని వైఎస్సార్సీపీ ఆశాభావంతో ఉంది. కనీస స్థాయిలో స్థానాలు సాధించినా సరే, పార్టీ ఇమేజ్ నిలబడుతుందని అధిష్ఠానం ధీమాగా ఉంటే.. పరాజయం ఎదురైతే కేడర్ మానసిక స్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.ఈ పురపాలక ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు లేదా కార్పొరేషన్ల అధికార పీఠాలకే పరిమితం కాకుండా, ఇరు పార్టీల శ్రేణుల మానసిక దృక్పథం పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత కోలుకోవడానికి ప్రయత్నిస్తున్న వైసీపీకి ఈ ఫలితాలు ఒక పరీక్ష లాంటివి. ఒకవేళ ఊహించని విధంగా వైసీపీ ఓ మాదిరి ఫలితాలను సాధించగలిగితే.. “పార్టీకి ఇంకా క్షేత్రస్థాయిలో పట్టు ఉంది, ప్రజాదరణ తగ్గలేదు అనే సందేశం ప్రజల్లోకి వెళ్లి, నాయకుల్లో సరికొత్త ఉత్సాహం నిండుతుంది. క్లిష్ట సమయం నుంచి కోలుకోవడానికి ఆ పార్టీకి ఇవి సంజీవనిలా ఉపయోగపడతాయి.మరోవైపు, అధికారంలోకి వచ్చాక సాధిస్తున్న ఈ విజయాల ఊపును కొనసాగించాలని ఎన్డీయే కూటమి ఉవ్విళ్లూరుతోంది. పట్టణ ప్రాంత ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధి, మౌలిక సదుపాయాల వైపే మొగ్గు చూపుతారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు తమకే విజయాన్ని అందిస్తాయని కూటమి నేతలు చెప్తున్నారు. నవంబర్ 3న వెలువడబోయే ఓట్ల లెక్కింపు ఫలితాలు వైఎస్సార్సీపీ భవిష్యత్ కార్యాచరణకు అత్యంత ప్రాధాన్యమైన దిక్సూచిగా మారనున్నాయి. ఈ ఫలితాలు వైసీపీని మళ్లీ పుంజుకునేలా ఉత్సాహపరుస్తాయా లేక అధికార కూటమికి తిరుగులేని ఆధిక్యాన్ని ఇచ్చి ప్రతిపక్షాన్ని మరింత ఇరకాటంలో పడేస్తాయా అనేది మరో రోజులో స్పష్టం కానుంది.

బాల ఉన్మాదులను.. దారిలో పెట్టేది ఎవరు?

అనంతపురం, నవంబర్ 2, పెన్ పవర్:
పాఠశాల అంటే.. చదువులకు చిరునామా.. పిల్లల మాటలు.. ఆటలు.. పాటలు వంటి వాటితో విలసిల్లే పవిత్రమైన ప్రాంతం. అటువంటి పాఠశాలలు దారుణాలకు కేంద్రమవుతున్నాయి. విద్యార్థులు చదువుకోవాల్సిన చోట నెత్తుటి మరకలు కనిపిస్తున్నాయి. అమాయకమైన పిల్లలపై తోటి విద్యార్థులు దారుణమైన దాడులకు దిగుతుండడం కలవరపాటుకు గురిచేస్తోంది. హర్యాన రాష్ట్రంలో పంచకుల ప్రాంతంలో తాజాగా జరిగిన ఘటన మన విద్యా వ్యవస్థలో ఉన్న లోపాన్ని.. పిల్లల ఆలోచన తీరును ఎత్తిచూపుతోంది.హర్యానా రాష్ట్రంలోని పంచకుల ప్రాంతంలో సెక్టార్ 20 లో సంస్కృతి మోడల్ స్కూల్ ఉంది. ఈ పాఠశాలలో జరిగిన సంఘటన దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. ఇక్కడ కేజీ చదువుతున్న ఒక చిన్నారిపై.. ఇదే పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఒక బాలుడు ఇటుకరాలతో దారుణంగా దాడి చేశాడు. బాలుడు చేసిన దాడుల వల్ల ఆ పాప స్పృహ కోల్పోయింది. ఆ పాపను ప్రస్తుతం ఒక ఆసుపత్రికి తరలించారు. అతడు చేసిన దాటికి సంబంధించిన దృశ్యాలు సిసి కెమెరాల ద్వారా బయటికి రావడంతో.. వాస్తవం ఏంటనేది తేలింది.ఇక రాప్తాడులో పదవ తరగతి చదివే విద్యార్థిని మీద.. ఒక యువకుడు తరగతి గదిలో అందరూ చూస్తుండగానే రంపం తో దాడి చేశాడు. ఈ దాడిలో ఆ బాలిక చెయ్యి తెగిపోయింది. ముఖం మీద తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ప్రేమకు నిరాకరించడం వ ల్లే అతడు ఈ స్థాయిలో దారికి పాల్పడినట్లు తెలుస్తోంది.ఇక నల్గొండ జిల్లాలో స్కూల్ ప్రిన్సిపాల్ ను అదే పాఠశాలలో చదివే విద్యార్థులు అత్యంత దారుణంగా చంపేశారు. ఆమె దగ్గర ఉన్న డబ్బులను దొంగిలించారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రంలో సంచలనం కలిగించింది.వాస్తవానికి చిన్న పిల్లలు ఇలా మారిపోవడానికి కారణాలు అనేకం ఉన్నాయి అంటున్నారు సైకాలజిస్టులు. ఈ విపరీత ధోరణికి అడ్డుగడ్డ వేయాలంటే పోలీసు కేసులు మాత్రమే సరిపోవని చెబుతున్నారు. తల్లిదండ్రులు.. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు ఉమ్మడిగా బాధ్యత తీసుకోవాలని చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజు సమయం కేటాయించాలని.. వారితో మాట్లాడాలని.. వారి మాట తీరును పరిశీలించాలని.. పాఠశాలలో వారికి ఎదురైనా అనుభవాలు.. స్నేహితుల గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలకు మొబైల్ ఫోన్ ఇచ్చేటప్పుడు.. వారు చూస్తున్న కంటెంట్.. ఆడుతున్న గేమ్ లపై నిరంతరం పర్యవేక్షించాలని చెబుతున్నారు. హింసాత్మకమైన ఆటలకు దూరంగా ఉండే విధంగా చేయాలని. ఇంట్లో ఏమాత్రం గొడవలు లేకుండా ప్రశాంతమైన వాతావరణం అందించాలని.. కోపాన్ని కాకుండా.. ప్రేమతో వారిని దగ్గర తీసుకోవాలని చెబుతున్నారు.. పాఠశాలల్లో కూడా సైకాలజిస్టులను నియమించుకోవాలని.. వారితో ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ అందించాలని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. మార్కులు.. ర్యాంకులు కాకుండా.. మానవీయకోణం.. ఇతరులను గౌరవించడం.. తోటి వారి మీద దయ కలిగి ఉండే వాటి లక్షణాలను పెంపొందించాలని సూచిస్తున్నారు.

హేమంత్ ఎన్ కౌంటర్

అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివే బాలిక మీద హేమంత్ అనే దుర్మార్గుడు తరగతి గదిలో చెట్లు కోసే రంపం తో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆ బాలిక తీవ్రంగా గాయపడింది. అతడు రంపంతో కోయడంతో ఒక చేయి విరిగింది. ముఖం మీద.. అనేక ప్రాంతాలలో తీవ్రంగా గాయాలయ్యాయి. రక్త స్రావం కూడా అధికంగా జరిగింది.మొదట్లో స్థానికంగా చికిత్స అందించినప్పటికీ.. అత్యవసర వైద్యం అందించాల్సి రావడంతో ఆ బాలికను బెంగళూరు తరలించారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు దాదాపు 12 గంటల పాటు శ్రమించి ఆమెకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులతో ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏప్పటికప్పుడు మాట్లాడారు. బాలికకు అందుతున్న వైద్యం గురించి సంప్రదింపులు జరిపారు. ఆదివారం మధ్యాహ్నం బాధిత బాలికను నారా లోకేష్ పరామర్శించారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ దారుణానికి పాల్పడిన హేమంత్ శనివారమే పోలీసులకు చిక్కాడని వార్తలు వచ్చాయి. అయితే ఆదివారం సాయంత్రం దాటిన తర్వాత ఆ దుర్మార్గుడికి సంబంధించిన వార్తలు మీడియాలో విస్తృతంగా సర్కులేట్ అయ్యాయి. హేమంత్ ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉన్నాడని.. పోలీసులు అతడిని పట్టుకునే క్రమంలో ఎదురు తిరిగాడని.. ఈ నేపథ్యంలో పోలీసులు అతని మీద కాల్పులు జరిపారని తెలుస్తోంది. దాదాపు 6 రౌండ్ల పాటు అతని మీద కాల్పులు జరిపారని సమాచారం. పోలీసుల కాల్పుల వల్ల హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించారని ప్రచారం జరుగుతోంది.ఈ ఘటన జరిగిన తర్వాత హేమంత్ ను ఎన్కౌంటర్ చేయాలని ప్రజల నుంచి డిమాండ్లు వ్యక్తం అయ్యాయి. నిన్న ఘటన జరిగిన దగ్గర నుంచి ఇవాల్టి వరకు కూడా సోషల్ మీడియాలో ఇదే చర్చ నడుస్తోంది. అటువంటి వ్యక్తులకు బతికే అవకాశం లేదని.. సమాజంలో మృగాల కంటే హీనంగా వ్యవహరిస్తున్న హేమంత్ లాంటి వ్యక్తులు బతకకూడదని.. సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఫోకస్ మొత్తం ఆ బాలికను ప్రాణాపాయం నుంచి బయటికి తీసుకొచ్చే దానిమీద మాత్రమే ఉంది. అయితే పోలీసు వ్యవస్థ హేమంత్ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చిందని తెలుస్తోంది.

చిన్నారికి సర్జరీ.. విద్యార్థులకు కౌన్సెలింగ్

మరోవైపు, ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన తోటి విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపేందుకు లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకోసం 20 మంది కౌన్సెలర్లతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం, ఘటన జరిగిన పదో తరగతి 'ఏ' సెక్షన్‌లోని 32 మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారితో, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతోంది. అదేవిధంగా 8, 9, 10 తరగతులకు చెందిన ఇతర విద్యార్థినులకు కూడా కౌన్సెలింగ్ అందించనున్నారు.ఈ చర్యల ద్వారా విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, తిరిగి ఆత్మవిశ్వాసంతో పాఠశాలకు హాజరయ్యేలా చూడటమే లక్ష్యమని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా చదువుపై దృష్టి సారించేలా అవసరమైన సహాయాన్ని కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు.

మరో వాయిగండం...

విశాఖపట్టణం, నవంబర్ 2, పెన్ పవర్:
బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను వేగంగా ముందుకు కదులుతుండటంతో ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అర్నబ్ తుపాను ప్రభావంతో జరిగిన నష్టం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో తుపాను ముప్పు పొంచి ఉండటం ప్రజలను కలవరపెడుతోంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు వాతావరణశాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది.బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను గత ఆరు గంటల్లో గంటకు 23 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 560 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 640 కిలోమీటర్లు, నెల్లూరుకు 630 కిలోమీటర్లు, ఒంగోలుకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను కదలికలను వాతావరణశాఖ నిశితంగా పరిశీలిస్తోంది. రేపు ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఇది తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.మురసు తుపాను తీరం దాటే సమయంపై వాతావరణశాఖ అంచనాలు ఆసక్తికరంగా మారాయి. సోమవారం అర్ధరాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజామున నెల్లూరు నుంచి నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు నమోదయ్యే ప్రమాదం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా సముద్ర తీరానికి సమీపంలో నివసించే మత్స్యకార కుటుంబాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా



పాటించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.తుపాను ప్రభావం కేవలం తీర ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలపై ఉండనుంది. మరో మూడు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల సమయంలో వరద నీటితో నిండిన రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని చెబుతున్నారు.మురసు తుపాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ

ప్రఖర్ జైన్ సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, అధికారుల నుంచి వచ్చే హెచ్చరికలను పాటించాలని కోరారు. అవసరమైన మందులు, తాగునీరు, అత్యవసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.మురసు తుపాను గమనం, తీవ్రత, తీరం దాటే ప్రాంతంపై స్పష్టత వచ్చే కొద్దీ ఏపీ యంత్రాంగం అప్రమత్తతను మరింత పెంచాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. తుపాను ప్రభావం ఎంత మేర ఉంటుందనేది రాబోయే 24 గంటల్లో కీలకం కానుంది. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండటం, అధికారుల సూచనలను పాటించడం అత్యంత అవసరం.

1300 కే ఏపీలో ధరణి రైస్

రాజమండ్రి, నవంబర్ 2, పెన్ పవర్: దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో బహిరంగ మార్కెట్లో బియ్యంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా పలు రకాలకు చెందిన బియ్యం కిలో రూ. 80 నుంచి రూ.100కు చేరింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ఏపీ ప్రభుత్వం వారికి శుభవార్త చెప్పింది.భారీగా పెరుగుతున్న బియ్యం, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగించేలా రాయితీపై పలు రకాల వస్తువులను అందిస్తోంది. ఫైన్ రకం బియ్యంతోపాటు.. ఉల్లిపాయతోపాటు ఇతర కూరగాయలను రాయితీపై అందిస్తోంది. అయితే, ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఊరటనిచ్చే విధంగా రూ. 1300లకే ధరణి బ్రాండ్ 26కిలోల సన్నబియ్యం బస్తాను అందుబాటులోకి తీసుకొచ్చింది.రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమలులో తిరుపతి జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. జిల్లాలోని రెండు ప్రధాన రైస్ మిల్లుల నుంచి తిరుపతి జిల్లాతోపాటు చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నంద్యాల మొత్తం ఎనిమిది జిల్లాలకు ధరణి బియ్యం బస్తాలను సరఫరా చేస్తున్నారు. ప్రతీరోజూ వేలాది క్వింటాళ్ల బియ్యం రైతుబజార్లు, పంపిణీ కేంద్రాలకు రవాణా అవుతోంది. తక్కువ ధరకు అందిస్తున్న 26కిలోల ధరణి బ్రాండ్ సన్న బియ్యం బస్తాలను అర్హులైన ప్రతీఒక్కరికీ పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. బస్తాను పొందే వినియోగదారుని పేరు, ఆధార్, ఫోన్ నెంబర్లను నమోదు చేస్తున్నారు.పాస్తా ఎంచుకోండిఇదిలాఉంటే.. ఈ ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతు బజార్లలో మాత్రమే కాకుండా మొబైల్ వాహనాల ద్వారా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు కూడా విక్రయాలను విస్తరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలని అన్నారు. మిగిలిన బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. మరోవైపు బియ్యం ధరలు అదుపులో ఉండేలా మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో అధికారులు చర్చిస్తున్నారు. కొన్నిరకాల బియ్యం ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో ఉన్నారు. బీపీటీ రకం స్టీమ్ బియ్యం కేజీ రూ.66, సాధారణ స్టీమ్ బియ్యం కేజీ రూ.47కు మించకుండా విక్రయించేందుకు అంగీకరించారని అధికారులు చెబుతున్నారు.

జెన్ జీకి అనుకూలంగా విజయసాయి అడుగులు

నెల్లూరు, నవంబర్ 2, (పెన్ పవర్: విజయసాయిరెడ్డి పార్టీ ఉద్దేశాలు.. విధివిధానాలను ఆయన అప్పుడప్పుడు సినిమా టీజర్ లాగా విడుదల చేస్తున్నారు.విజయ సాయి రెడ్డి ప్రజలను కాకుండా.. సామాజిక మాధ్యమాలను నమ్ముకున్నారు. తన పార్టీ గురించి.. విధివిధానాల గురించి ఇప్పటివరకు కొన్ని విషయాలు మాత్రమే చెప్పారు. ఇప్పుడు వాటిని బహిరంగంగా బయటపెట్టే క్రమంలో రీల్స్ ను ఉపయోగిస్తున్నారు. జన్ జడ్ మీద పూర్తిగా దృష్టి సారించిన ఆయన.. వారిని ఆకట్టుకునేందుకు రీల్స్ మాత్రమే మార్గమని భావించారు. అందువల్లే రియల్ టైం నుంచి రీల్స్ టైం లోకి వచ్చేసారు.ఒకప్పుడు విజయసాయిరెడ్డి వైసీపీలో కీలక నాయకుడిగా ఉండేవారు. జగన్ కు దగ్గరగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత సొంత రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని పనులు నిమగ్నమయ్యారు. అయితే ఆయన రాజకీయాల్లోకి తిరిగి వచ్చిన తీరు.. ప్రజల్లోకి వెళ్లాలి అనుకుంటున్నా ప్రచార పద్ధతులు ఇప్పుడు పూర్తిగా ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా సోషల్ మీడియా రీల్స్ ద్వారా తన రాజకీయ ఆలోచనలను ఆయన ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.విజయసాయిరెడ్డి గతంలో రాజ్యసభ సభ్యుడిగా.. వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2025 జనవరిలో రాజ్యసభ సభ్యత్వానికి.. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా.. క్రియాశీలమైన రాజకీయాలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. అయితే ఆ విరామం ఎక్కువ కాలం కొనసాగలేదు. సరిగా ఈ ఏడాది ఆగస్టులో తిరిగి రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రజల గొంతుకను.. అసెంబ్లీ.. పార్లమెంట్లో వినిపించేందుకు కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ఆయన వెల్లడించారు.ఏపీ రాజకీయాల్లో కొత్త పార్టీలు రావడం కొత్తేమీ కాదు. కానీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజకీయాల్లోకి తిరిగి వస్తున్న తీరు మాత్రం ఆసక్తిని కలిగిస్తోంది. ఒకప్పుడు వైసిపి కీలక వ్యూహకర్తగా వ్యవహరించిన ఆయన ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు అడుగులు వేస్తున్నారు. అయితే ఈసారి ఆయన రాజకీయ ప్రచారంలో సోషల్ మీడియాకు.. ముఖ్యంగా డిజిటల్ మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాలు మారిపోతున్నాయా.. రాజకీయ ప్రచారం రీల్స్ స్థాయికి చేరుతోందా అరే చర్చ కూడా మొదలైంది. విజయ్ సాయి రెడ్డి గతంలో జగన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ వ్యవహారాలలో కీలక పాత్ర పోషించారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. అయితే 2025 జనవరిలో ఊహించని విధంగా రాజ్యసభ సభ్యత్వానికి.. వైసీపీకి రాజీనామా చేశారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటారని సంకేతాలు కూడా ఇచ్చారు. కానీ 2020లో మళ్ళీ తన రాజకీయ భవిష్యత్తుపై కీలకమైన ప్రకటనలు చేస్తూ.. సంచలనానికి కారణమయ్యారు.తన రాజకీయ ప్రస్థానంలో కొత్త అధ్యయాన్ని ప్రారంభించాలని విజయ సాయి రెడ్డి అనుకున్నారు. టిడిపి.. వైసిపి వంటి పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రజల సమస్యలను అసెంబ్లీ.. పార్లమెంట్ లో వినిపించడమే తన లక్ష్యమని చెప్పారు. తన పార్టీలో యువతకు పెద్దపీట వేస్తానని కూడా వెల్లడించారు. 40 సంవత్సరాల వారికి పార్టీలో అవకాశాల్లో 66% ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి జనవరి 1న ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించడం.. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగులకు నెలకు పదివేల భృతి ఇచ్చే ప్రతిపాదనను ప్రస్తావించారు..కొత్త పార్టీ ఏర్పాటుకు విజయసాయిరెడ్డి ముహూర్తాన్ని కూడా ప్రకటించారు.
నవంబర్ 11న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో పార్టీ పేరు ప్రకటిస్తానని అక్టోబర్ 20న ఆయన వెల్లడించారు. దీంతో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ రాక మీద చర్చ మొదలైంది. ఇప్పటి రాజకీయాల్లో సభలు, సమావేశాలు, ప్రెస్ మీట్లు మాత్రమే సరిపోవడం లేదు.. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వెళ్లడం కూడా ముఖ్యమైనదని.. ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్..ఇన్ స్టా గ్రామ్ రీల్స్, ఫేస్ బుక్ వీడియో ద్వారా తన ప్రసంగాలను ప్రజలకు తీసుకెళ్లాలని విజయసాయిరెడ్డి భావిస్తున్నారు.

తీవ్ర తుపానుగా మురసు.. ఏపీ తీరానికి రెడ్ అలర్ట్

నెల్లూరు పెన్ పవర్:
పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'మురసు' తుపాను, తీవ్ర తుపానుగా బలపడింది. ఇది నేటి అర్ధరాత్రి నుంచి రేపు (3వ తేదీ) తెల్లవారుజాము లోపు నెల్లూరు – నర్సాపురం మధ్య, ప్రధానంగా ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సోమవారం ఉదయం నాటికి ఈ తుపాను ఒంగోలుకు 330 కి.మీ, నెల్లూరుకు 290 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, ఇవి గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల తీర ప్రాంతాల్లో 1.0 నుంచి 1.5 మీటర్ల ఎత్తున సముద్రపు అలలు (స్టార్మ్ సర్జ్) ఎగిసిపడే ప్రమాదం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని అధికారులు స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

పెన్ పవర్

రోహిత్ వర్సెస్ కోహ్లీ: ఎవరు సెంచరీ చేస్తారు? పుజారా అంచనా ఇదే..!

- కోహ్లీకి సెంచరీ అవకాశాలు ఎక్కువన్న పుజారా
- మూడో స్థానంలో బ్యాటింగ్ కోహ్లీకి కలిసొస్తుందని వ్యాఖ్య
- న్యూజిలాండ్‌లో రోహిత్ పాత్ర మారొచ్చని అంచనా
- ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని జోస్యం
- న్యూజిలాండ్‌కు స్వల్ప ఆధిక్యం ఉంటుందని అభిప్రాయం



న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ కంటే విరాట్ కోహ్లీకి సెంచరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లీ మూడో స్థానంలో రావడం అతడికి ఇన్నింగ్స్‌ను నిర్మించుకునే అవకాశం కల్పిస్తుందని చెప్పాడు. అదే సమయంలో ఓపెనర్‌గా రోహిత్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుందని, న్యూజిలాండ్ పిచ్‌లపై అతడి పాత్రలో మార్పు ఉండొచ్చని పేర్కొన్నాడు.

జియోస్టార్‌తో మాట్లాడిన పుజారా.. "రోహిత్ సాధారణంగా పవర్‌ప్లేలో జట్టుకు మంచి ఆరంభం అందించడంపై దృష్టి పెడతాడు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో అతడి పాత్ర మారవచ్చు. అయితే కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. ఇన్నింగ్స్‌ను నిలబెట్టి ఆడటం అతడి ఆటతీరులో కీలకం. ఈ స్థానంలో వచ్చే బ్యాటర్‌కు వన్డేల్లో సెంచరీ చేసే అవకాశం కొంత ఎక్కువగా ఉంటుంది. అందుకే రోహిత్ కంటే కోహ్లీకి శతకం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నా" అని వివరించాడు.

ఈ సిరీస్ హోరాహోరీగా సాగుతుందని పుజారా అంచనా వేశాడు.

ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని, వర్షం కారణంగా ఓ మ్యాచ్ రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆడే భారత జట్టు, చివరి రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగే జట్టు వేరుగా ఉండనుండటం న్యూజిలాండ్‌కు కొంత అనుకూలిస్తుందని అభిప్రాయపడ్డాడు.అయితే తొలి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు మెరుగ్గా రాణిస్తుందని పుజారా విశ్వాసం వ్యక్తం చేశాడు. చివరి రెండు మ్యాచ్‌లు టీమిండియాకు కొంత సవాలుగా మారవచ్చని అన్నాడు. న్యూజిలాండ్‌లో వర్షాలు కూడా మ్యాచ్‌ల ఫలితాలపై ప్రభావం చూపవచ్చని పేర్కొన్నాడు.

దిగ్గజ జట్లకు షాక్.. వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్
- తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు
- శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లను వెనక్కి నెట్టిన వైనం
- వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అద్భుత ప్రదర్శనలతో సత్తా చాటిన ఆఫ్ఘన్
- ఇటీవల ఐర్లాండ్, జింబాబ్వే సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌లతో జోరు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది.ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది.వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

టీమిండియా కోచ్‌గా మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నా.. గంభీర్ కీలక వ్యాఖ్యలు



టీమిండియా హెడ్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వహించడం అంత సులభం కాదు. ప్రతి మ్యాచ్‌లో గెలవాలనే అంచనాలు.. ఆటగాళ్ల ఎంపికలో సవాళ్లు.. వరుస పర్యటనలు.. ఇలా నిరంతరం ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో తాను కూడా కొన్నిసార్లు మానసికంగా అలసిపోతున్నానని భారత జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరించాడు. అయితే ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తనకు ఉందని స్పష్టం చేశాడు.న్యూజిలాండ్‌తో ఐదో టీ20 ముగిసిన అనంతరం మీడియాతో గంభీర్ మాట్లాడాడు. మూడు ఫార్మాట్లకు ఒకేసారి కోచ్‌గా వ్యవహరించడం సవాలుతో కూడుకున్నదని చెప్పాడు. ముఖ్యంగా వరుస పర్యటనలు, ప్రయాణాలు, మ్యాచ్‌ల మధ్య తగినంత విరామం లేకపోవడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపాడు. భారత జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు ప్రతి మ్యాచ్ గెలవాలనే అంచనాలు ఉంటాయని పేర్కొన్నాడు. "నిజం చెప్పాలంటే.. నేను కూడా మానసికంగా అలసిపోయిన సందర్భాలున్నాయి. కానీ ఆ ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి నాకుంది. సాధ్యమైనంత కాలం దాన్ని భరిస్తాను. ఒత్తిడిని తట్టుకోగలను. అవసరమైతే బుల్లెట్‌ను కూడా ఎదుర్కొంటాను. నేనూ మనిషినే. కొన్నిసార్లు అలసట తప్పదు. అయితే ఇప్పటివరకు ఆ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నా" అని గంభీర్ వెల్లడించాడు.న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఓడినప్పటికీ తొలి మూడు మ్యాచుల్లో విజయం సాధించడం గొప్ప విషయమని గంభీర్ అన్నాడు. న్యూజిలాండ్‌కు చేరుకున్న తర్వాత ఆటగాళ్లకు కేవలం ఒక్కరోజు మాత్రమే సాధనకు అవకాశం లభించిందని గుర్తుచేశాడు. భిన్నమైన వాతావరణం, మైదాన పరిస్థితుల్లోనూ జట్టు అద్భుతంగా ఆడిందని ప్రశంసించాడు. ఈ విజయానికి ఆటగాళ్లే పూర్తి క్రెడిట్ తీసుకోవాలని చెప్పాడు.2026లో ఇప్పటివరకు భారత జట్టుతో కలిసి 12 సిరీస్‌లలో గంభీర్ కోచ్‌గా వ్యవహరించాడు. మూడు ఫార్మాట్ల బాధ్యతలు ఒకేసారి నిర్వహిస్తుండటంతో విశ్రాంతికి పెద్దగా అవకాశం దక్కడం లేదు. న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల తర్వాత రెండు టెస్టుల సిరీస్ కూడా జరగనుంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లకు తగినంత సన్నద్ధత సమయం కల్పించడం ముఖ్యమని గంభీర్ అభిప్రాయపడ్డాడు.

శ్రద్ధా కపూర్ ట్రెడిషనల్ లుక్ అదుర్స్.. ఆభరణాలే స్పెషల్ అట్రాక్షన్!



ముదురు ఎరుపు రంగు ఎంబ్రాయిడరీ చీరలో సోనం బజ్వా అద్భుతంగా కనిపిస్తున్నారు





లీగల్ జర్డోజీ లెహంగా లుక్‌లో చెత్నా పాండే స్టన్

బాలీవుడ్ అందాల భామ శ్రద్ధా కపూర్ తన సహజమైన నవ్వుతో, ముచ్చటైన సంప్రదాయ లుక్స్‌తో ఎంతోమంది అభిమానుల హృదయాలను కొల్లగొడుతుంటారు. తాజాగా ఈ పండుగ వేడుకలో పర్పుల్ అండ్ మెజెంటా కాంబినేషన్‌లోని పట్టు చీరను ధరించి, నిండైన భారతీయ నారీమణిలా మెరిసిపోయారు. పద్ధతైన లుక్‌లో కనిపిస్తున్న శ్రద్ధా ధరించిన అవుట్‌ఫిట్, ఆభరణాల ప్రైస్ బ్రేక్‌డౌన్‌తో పాటు ఆమె నటిస్తున్న లేటెస్ట్ సినిమా విశేషాలు ఇప్పుడు సరళంగా చూద్దాం..

పర్పుల్ సిల్క్ శారీ అండ్ డిజైనర్ గాజులు:

ఈ ట్రెడిషనల్ లుక్ కోసం శ్రద్ధా కపూర్ రాయల్ పర్పుల్ రంగులో ఉన్న పట్టు చీరను ఎంచుకున్నారు. ఈ చీరకు ఉన్న రిచ్ మెజెంటా కలర్ బార్డర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పర్పుల్ సిల్క్ శారీ అంచనా ధర సుమారు రూ. 25,000గా ఉంది. ఇక దీనికి తోడుగా చేతులకు ధరించిన 'గ్రీన్ ఆ గోల్డ్ బ్యాంగిల్స్ సెట్' రూ. 6,000 ఆమె సంప్రదాయ లుక్‌కి మరింత శోభను తెచ్చిపెట్టింది.

గోల్డ్ చోకర్ అండ్ ట్రెడిషనల్ ఆభరణాలు:

ఈ చీరకు పర్‌ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా శ్రద్ధా క్లాసీగా ఉండే సాంప్రదాయ బంగారు ఆభరణాలను ధరించారు. మెడలో వేసుకున్న గోల్డ్-టోన్డ్ చోకర్ నెక్లెస్ అంచనా ధర రూ. 8,000 కాగా, ట్రెడిషనల్ గోల్డ్ జుంకా ఇయర్ రింగ్స్ ధర సుమారు రూ. 12,000గా ఉంది. అలాగే కాళ్లకు గోల్డ్ పట్టీలు రూ. 3,000 మరియు ఎంబెల్లిష్డ్ జుత్తీ ఫ్లాట్స్ రూ. 5,000 ధరించి ఎంతో పద్ధతిగా, దేవకన్యలా మెరిసిపోయారు.

లావణి నృత్యం నేపథ్యంలో 'ఈథా' సినిమా:

గ్లామర్ పాత్రలతోనే కాకుండా వైవిధ్యమైన కథలతో అలరించే శ్రద్ధా కపూర్, ఇప్పుడు మహారాష్ట్ర సంప్రదాయ నృత్యకళ లావణి నేపథ్యంలో తెరకెక్కుతున్న 'ఈథా' అనే బాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణి కళాకారిణి విఠాబాయి భౌ మాంగ్ నారాయణ్‌గావ్కర్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రద్ధా కళాకారులతో కలిసి వేసిన లావణి డాన్స్ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం.. నానా పటేకర్ కీలక పాత్ర:

దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మద్దాక్ ఫిల్మ్స్ మరియు కత్పుత్లీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో శ్రద్ధా 'ఈథా బాయి' పాత్రలో అలరించనుండగా, దివంగత నటుడు నానా పటేకర్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఇక ప్రభాస్ సరసన 'సాహో' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన శ్రద్ధా, ఈ బయోపిక్ చిత్రంతో బాలీవుడ్‌లో మరో భారీ హిట్‌ను తన ఖాతాలో వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.ఇక మొత్తానికి చూస్తే, ఎక్కువ హంగులు లేకుండానే నిండైన పట్టు చీర, సాంప్రదాయ ఆభరణాలతో శ్రద్ధా కపూర్ చూపించిన ఈ క్లాసీ ఎలిగంట్ లుక్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఒకవైపు సంప్రదాయ ఫ్యాషన్ సెన్స్‌తో అలరిస్తూనే, మరోవైపు 'ఈథా' వంటి వైవిధ్యమైన సినిమాలతో శ్రద్ధా బాలీవుడ్‌లో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965